

ఊరంతా జాతర

మంగళవారం రాత్రి 12 గంటల ప్రాంతంలో గంగమ్మ విశ్వరూప ప్రతిమ తయారీ

- భక్తజనంతో పోటెత్తిన గంగమ్మ ఆలయం
- వేకువజామున చెంపనరుకుడుతో ముగియనున్న సంబరం



అడుగడుగునా దండాలు. వీధి, వీధిన అంబళ్లు. నడివీధుల్లో సందళ్లు. వెరసి ఊరంతా జాతర సంబరం చేసుకుంది. అమ్మలుగన్న అమ్మకు పొంగళ్లు పెట్టుకుని ప్రణమిల్లింది. కోర్కెలు తీర్చే కొంగు బంగారాన్ని కళ్లకద్దుకుని తన్మయత్వమైంది. భక్తి పారవశ్యంతో చిందేసింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతి గంగజాతరకు చాటింపు అనంతరం వివిధ వేషాలలో మునిగితేలిన తాతయ్యగుంట గంగమ్మను మంగళవారం ఉదయాత్పూర్వం విశిష్ట అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. మహాభిషేకంలో అర్చకులు మినహా ఎవరినీ అనుమతించలేదు. సర్వాలంకారశోభితమైన గంగమ్మకు అర్చకులు వజ్రకిరీటధారణ చేశారు. సోమవారం అర్ధ రాత్రి నుంచే కొందరు భక్తులు దండాలు, పొర్లు దండాలు పెట్టుకుంటూ, వేషాలతో అమ్మవారిని దర్శించుకున్నారు. ఇలా.. అభిషేకానంతర దర్శనం మొదలుకొని నిర్విరామంగా గంగమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. పురుషులు పలురకాల విచిత్ర వేషధారణలతో పాటు, మహిళలు కొందరు వేపాకు చీరలు కట్టుకుని అమ్మవారి ఆలయ ప్రదక్షణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గర్భాలయంలోకి ఇతరులు వెళ్లకుండా కమిషనర్ మౌర్య కట్టడి చేయడంతో భక్తులకు అసౌకర్యం లేకుండా క్యూలైన్లు ముందుకు కదలాయి. ఇక, ఒక్క తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలోనే కాకుండా.. టీపీ ఏరియాలో తాళ్లపాక పెదగంగమ్మ, చింతలచేనులో ముత్యాలమ్మ, దాసరిమఠంలో మాతమ్మ, పల్లెవీధిలో వేశాలమ్మ, చింతకాయవీధిలో కరిమాను గంగమ్మతో పాటు నగరంలోని చిన్నచిన్న గంగమ్మ ఆలయాల్లోనూ జాతర సంబరాలు జరిగాయి. దీంతో నగరమంతా జాతర సందడి నెలకొంది. మంగళవారం భక్తులు పలు పౌరాణిక, జానపద వేషాలు ధరించి అమ్మవార్లను దర్శించుకున్నారు. వైసీపీ మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, ఆర్కే రోజాలు అమ్మవారిని దర్శించుకున్నారు. అదేవిధంగా సీపీఐ నేత నారాయణ కూడా ఆలయానికి వచ్చారు. కాగా, వారం రోజుల గంగజాతరలో మంగళవారం ఒక్క రోజు మాత్రమే అమ్మవారికి అలంకరించే బంగారు ముఖ కవచం, వజ్రకిరీటధారిణిని దర్శించుకున్న భక్తులు తన్మయత్వంలో మునిగిపోయారు.

పారిశుధ్యం భేష్

తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి వేలాది మంది భక్తులు సమర్పించే పొంగళ్ల నైవేద్యాలు, జంతుబలుల వ్యర్థాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంలో నగర పాలకసంస్థ పారిశుధ్య కార్మికులు శ్రమించారు. మూడు షిఫ్టుల్లో 150 మందికి పైగా కార్మికులు నిర్విరామంగా శ్రమించి భక్తులచేత శభాష్ అనిపించుకున్నారు.



నేడు విశ్వరూప దర్శనం

అమ్మవారి విశ్వరూప దర్శనం కోసం భక్తులు వేచి చూస్తున్నారు. పేరంటాల వేషధారులు పంబల వాయిద్యాలతో చాటు మండపం వద్దకు వెళ్లిన తరువాత బేరిశెట్టి ఇంటికి వెళ్లి అక్కడనుండి మరికొన్ని చోట్లకు వెళ్లి పేరంటాలు పూజలు అందుకుంటారు. అక్కడ నుండి బుధవారం వేకువజామున చిన గంగమ్మ చెంప నరికి ఆతరువాత పెద గంగమ్మ చెంప నరకడంతో జాతర సంబరం ముగుస్తుంది.

అమ్మకు పొంగళ్లు.. భక్తులకు అంబళ్లు

మంగళవారం వేకువజామునుంచే మహిళా భక్తులు ఆలయ ప్రాంగణం వద్దకు చేరుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కూరగాయల మార్కెట్లో పొంగళ్లు పొంగించి అమ్మవారి ఆలయం వద్దకు వచ్చి నైవేద్యం సమర్పించారు. ఇంటినుంచి తెచ్చుకున్న అంబళ్లను భక్తులను అందజేశారు.

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ

- సమూల మార్పులకు శ్రీకారం
- తొమ్మిది రకాలుగా స్కూళ్ల విభజన
- 162 పాఠశాలల ఉన్నతీకరణ
- విద్యార్థుల సంఖ్య ఆధారంగా టీచర్ల కేటాయింపు
- పలు టీచర్ల పోస్టుల్లో సైతం మార్పులు

చిత్తూరు సెంట్రల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయ విద్యాహక్కు చట్టం అమలులో భాగంగా పాఠశాలలకు సంబంధించి విద్యాశాఖ సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది.ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడం, డ్రాపౌట్లను తగ్గించడం, సబ్జెక్టు ఉపాధ్యాయులకు పనిభారాన్ని తగ్గిచడం, విద్యార్థుల అభ్యాస ఫలితాలు మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ మార్పులు చేపట్టనున్నారు.ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 162 ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయనున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 4,719వున్నాయి.17,372 టీచర్ల పోస్టులు మంజూరు కాగా, ప్రస్తుతం 15,454 మంది టీచర్లు పనిచేస్తున్నారు.1918 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 723మంది ఉపాధ్యాయులుండగా, ఎంపీపీ/జడ్పీ పాఠశాలల్లో 15,552 మంది, మున్సిపల్ పాఠశాలల్లో 589మంది, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో 508 మంది టీచర్లు పనిచేస్తున్నారు. గత నాలుగు నెలల కాలంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 4719 పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను విద్యాశాఖ చేపట్టింది.కలెక్టర్ అధ్యక్షతన జరుగుతున్న ఈ ప్రక్రియలో విద్యాశాఖ అధికారులు డీఈవో, డీవైఈవో, ఎంఈవోలు కీలక పాత్ర పోషిస్తున్నారు. అంగన్‌వాడీల నుంచి ఇంటర్మీడియట్ విద్య వరకు ప్రభుత్వ,జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలను తొమ్మిది రకాలుగా విభజిస్తున్నారు.

పాఠశాలల్లో సిబ్బంది

ప్రీ ప్రైమరీ పాఠశాల(ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, 1-5 తరగతులు)ల్లో 1నుంచి 30మంది విద్యార్థులుంటే ఒక సెకండరీ గ్రేడ్ టీచర్, 31నుంచి 60 మంది దాకా ఉంటే ఇద్దరు సెకండరీ గ్రేడ్ టీచర్లను కేటాయిస్తారు.● మోడల్ ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో 1నుంచి 59 మంది విద్యార్థులుంటే మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం/స్కూల్ అసిస్టెంట్, ముగ్గురు ఎస్జీటీలను కేటాయిస్తారు. 60నుంచి 150మంది దాకా విద్యార్థులుంటే ఒక మోడల్ స్కూల్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం/స్కూల్ అసిస్టెంట్, నలుగురు ఎస్జీటీలను కేటాయిస్తారు. 150కి పైగా విద్యార్థులుంటే ప్రతి 30 మంది విద్యార్థులకు అదనంగా ఒక ఎస్జీటీని కేటాయిస్తారు.● ఉన్నత పాఠశాల (6-8 తరగతులు)- 1నుంచి 10మంది విద్యార్థులకు ఒక స్కూల్ అసిస్టెంట్, 11నుంచి 30 మంది విద్యార్థులకు ఇద్దరు ఎస్ఏలు, 31నుంచి 140 వరకు నలుగురు ఎస్ఏలు,141 నుంచి 175 వరకు విద్యార్థులుంటే ఐదుగురు ఎస్ఏలను కేటాయిస్తారు. ● 75మంది విద్యార్థులున్న ఉన్నత పాఠశాలల్లో సీనియర్ ఎస్ఏ హెచ్ఎంగా వ్యవహరిస్తారు.● క్లస్టర్ ఉన్నత పాఠశాలల్లో ఒక హెచ్ఎం, ఒక ఎస్(పీఈ)/పీఈటీ పోస్టు కేటాయిస్తారు. 76కంటే ఎక్కువమంది విద్యార్థులుంటే హెచ్ఎం, ఎస్ఏ(పీఈ)/పీఈటీ పోస్టులు కేటాయిస్తారు.● 400 మంది విద్యార్థుల కంటే ఎక్కువ ఉంటే రెండు ఎస్ఏ, 751 మంది నమోదైతే 3వ ఎస్ఏ పోస్టు కేటాయిస్తారు. ఇలా 350మంది విద్యార్థులకు ఒక ఎస్ఏ పోస్టు కేటాయిస్తారు.

టీచర్ల కేడర్లలోనూ మార్పులు

స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎంలుగా మార్చారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎంపీపీ/జడ్పీ యాజమాన్యాల్లో 612మంది, మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆరుగురు ఉన్నారు. ● క్లస్టర్ స్థాయిలో వర్కింగ్ సర్వస్ స్కూల్ అసిస్టెంట్/సెకండరీ గ్రేడ్ టీచర్, తత్సమాన పోస్టులను క్లస్టర్ లెవల్ అకడమిక్ టీచర్లుగా ఉపయోగించుకోనున్నారు. ఎంపీపీ/జడ్పీ యాజమాన్యాల్లో స్కూల్ అసిస్టెంట్లు 134మంది ఉండగా, ప్రభుత్వ యాజమాన్యంలో 6, మున్సిపల్ కార్పొరేషన్ లో 8 మంది ఉన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యాశాఖలోని డీఈవో పూల్లో 217 మంది టీచర్లున్నారు. 65మంది హెచ్ఎంలు, 195మంది స్కూల్ అసిస్టెంట్లు, 11మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు ఉన్నారు. వీరిని సైతం సర్దుబాటు చేయనున్నారు.

1.శాటిలైట్ ఫౌండేషన్ స్కూళ్లు (ప్రీ ప్రైమరీ, ప్రైమరీ (అంగన్‌వాడీలు)	- 58
2.ఫౌండేషన్ స్కూళ్లు (ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, ఒకటి, రెండు తరగతులు)	- 991
3.బేసిక్ ప్రైమరీ స్కూళ్లు (ప్రీ ప్రైమరీ, ప్రైమరీ 1-5 తరగతులు)	-2018
4.మోడల్ ప్రైమరీ స్కూళ్లు (ప్రీ ప్రైమరీ, ప్రైమరీ 1-5 తరగతులు)	-928
5.అప్పర్ ప్రైమరీ స్కూళ్లు (ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, 1-8 తరగతులు)	-70
6. హైస్కూళ్లు (6-10 తరగతులు)	- 526
7. హైస్కూళ్లు (1-10 తరగతులు)	- 71
8.హైస్కూల్ ప్లస్ (6-12 తరగతులు) + బేసిక్ ప్రైమరీ స్కూళ్లు 9.హైస్కూల్ ప్లస్ (1-12 తరగతులు) + మోడల్ ప్రైమరీ స్కూళ్లు	- 57
మొత్తం	4719





స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

ముగిసిన అమ్మవారి వసంతోత్సవాలు

తిరుచానూరు, మే 13(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి వసంతోత్సవాలు మంగళవారం రాత్రి ముగిశాయి. ఉదయం మూలమూర్తికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో నేత్రపర్వంగా అభిషేకం జరిగింది. మధ్యాహ్నం ఉత్సవర్లను ఫ్రైడే గార్డెన్‌కు వేంచేపు చేసి బంగారు పీఠంపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి అమ్మవారికి వీధోత్సవం జరిగింది. మూడు రోజులపాటు జరిగిన వేడుకలు మహాపూర్ణాహుతితో ముగిశాయి. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, టీటీడీ ఉద్యానశాఖ అధికారి శ్రీనివాసులు, ఏఈవో దేవరాజులు, అర్చకులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సహకార సొసైటీ అక్రమాలపై నేటి నుంచి విచారణ

తిరుపతి(నేరవిభాగం), మే 13(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు సహకార సొసైటీలో జరిగిన రూ.80 లక్షల అక్రమాలపై బుధవారం నుంచి అధికారులు విచారణ చేపట్టనున్నారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి నేతృత్వంలో క్రైం డీఎస్పీ శ్యామ్‌సుందర్, నాయుడుపేట డీఎస్పీ శేషుబాబు విచారణాధికారులుగా నియమితులైన విషయం తెలిసిందే. ఈ అక్రమాలకు సూత్రధారులు ఎవరనే కోణంలో వీరు దర్యాప్తు చేసి ఎస్పీకి నివేదిక సమర్పించనున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. దాదాపు ఐదుగురు పోలీసు సిబ్బంది హస్తం ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని పక్కకు తప్పించారు. కాగా, దుర్వినియోగమైన రూ.80 లక్షల్లో.. రుణాలు తీసుకున్న సొసైటీ సభ్యుల్లో ఎవరు చెల్లించిన డబ్బులు ఉన్నాయి? వీరు ఎప్పుడు చెల్లించారనే వివరాలు సేకరించే పనిలో అధికారులు ఉన్నారు. ఈ ఘటనలో ఆధారాలు దొరక్కుండా డేటాను మార్చే ప్రయత్నాలు జరుగుతున్నట్లు విమర్శలున్నాయి. మరో వైపు తమకు న్యాయం చేయాలని బాధిత పోలీసులు కోరుతున్నారు.

పిడుగుపాటు మృతులకు పరిహారం మంజూరు

తిరుపతి, మే 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లాలో అకాల వర్షాల సందర్భంగా పిడుగుపాటుతో మరణించిన నలుగురి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఈనెల 2న ఎర్రావారిపాలెం మండలం బోడేవాండ్లపల్లి పంచాయతీ వడ్డిపల్లికి చెందిన కోటకొండ రమణ (59).. 4న నాయుడుపేట మండలం వద్దిగుంట కండ్రిగకు చెందిన అల్లం భాస్కర్ (54), నాయుడుపేటకు చెందిన మారిబోయిన కార్తీక్ (10), వాకాడు మండలం బాలిరెడ్డిపాలేనికి చెందిన రెడ్డి మునెయ్య (44) పిడుగుపాటుకు బలైన సంగతి తెలిసిందే. ఈ రెండు తేదీలలో పిడుగు పాటుకు మృతి చెందిన నలుగురికి సంబంధించి.. ఒక్కో కుటుంబానికి రూ.4 లక్షలు వంతున ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. ఈ మేరకు మృతుల కుటుంబాలకు రూ.16 లక్షలు చెల్లించాలని కలెక్టర్‌ను ఆదేశిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపునకు సర్వే

చంద్రగిరి, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలున్న బడిఈడు పిల్లల కోసం ఐఈఆర్‌టీలు పట్టణంలోని దర్శివీధి, చర్చివీధి, బ్రాహ్మణవీధి, జమండ్ల వీధి ప్రాంతాల్లో సర్వే చేస్తున్నారు. జిల్లా ఐఈ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈవో భాస్కర్‌బాబులు మంగళవారం సర్వే తీరును తనిఖీ చేశారు. ఈసందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలను చంద్రగిరిలోని పద్మావతి బాలికల జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత స్కూల్‌కు తీసుకురావాలని తల్లిదండ్రులను కోరారు. సర్వేలో ఐఈఆర్‌టీలు వెంకట రాజేశ్వరి, శ్యామలదేవి పాల్గొన్నారు.

వేపాకు చీర అలంకరణలో మిట్టమీద గంగమ్మ




చంద్రగిరి, మే 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి గంగమ్మ జాతర పురస్కరించుకుని చంద్రగిరి మిట్టమీద గంగమ్మ మంగళవారం వేపాకు చీర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని, పొంగళ్ళు నైవేద్యం సమర్పించారు. ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఎంబీయూలో నేడు అచీవర్స్ డే

చంద్రగిరి, మే 13(ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేట సమీపలంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో బుధవారం అచీవర్స్ డే నిర్వహించనున్నారు. ప్లేస్‌మెంట్ పొందిన 1600 మందికి పైగా విద్యార్థులను ఘనంగా సత్కరించనున్నారు. ఎంబీయూ ఛాన్సలర్ మోహన్‌బాబు, ప్రొ ఛాన్సలర్ మంచు విష్ణు, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, ప్రొవోస్ట్ నాగరాజ రామారావ్, వైస్ ఛాన్స్‌లర్ కరుణాకరన్, చీఫ్ గ్రోత్ అండ్ స్ట్రాటజిక్ ఆఫీసర్ వికాస్ సింగ్, రిజిస్ట్రార్ సారథిలు పాల్గొంటారని వర్సిటీ వర్గాలు తెలిపాయి.

ఘనంగా సత్యమ్మతల్లి గంగజాతర



అమ్మవారికి పట్టువస్త్రాలు తెస్తున్న ఎమ్మెల్యే నాని

పాకాల, మే 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సత్యమ్మ తల్లి గంగజాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి ప్రతిమ ప్రతిష్ఠాపన చేసి పొంగళ్ళు, అంబలి నైవేద్యం సమర్పించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ కమిటి నిర్వాహకులు, స్థానికులు మంగళ వాయిద్యాలతో, వేద పండితుల పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తెల్లవారుజాము నుంచే ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. విచిత్ర వేషధారణలతో పరిసరాలు కోలాహలంగా మారాయి. వీధులు, ఆలయం వద్ద ప్రత్యేక దీపాలు, పుష్పాలతో అలంకరించారు.

వాడవాడలా గంగమ్మకు పొంగళ్లు



రామచంద్రాపురం, మే 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి గంగ జాతర సందర్భంగా మండలంలోని గంగిరెడ్డిపల్లి, తొకగుట్లఊర్లు, పీవీపురం, అనుపల్లి, రాయలచెరువుపేట గ్రామాల్లో మంగళవారం పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. గంగమ్మ ప్రతిమకు పంచామృతాభిషేకం నిర్వహించిన అనంతరం అలంకరణ చేశారు.

ఖాకరాపేట: చిన్నగొట్టిగల్లు చెరువు కట్టపై తిరుపతి గంగమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి ఉదయం అభిషేకాలు, అర్చనలు అనంతరం విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు పొంగళ్లు పెట్టి బోనాలు సమర్పించారు. చలిమిడితో రాగ దీపాలు తయారు చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో ఎడిఫై విద్యార్థుల ప్రతిభ



హర్ష్ గుమ్మా-తేజస్.కె

తిరుచానూరు, మే 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎడిఫై స్కూల్ విద్యార్థులు మరోసారి సత్తా చాటారు. మంగళవారం విడుదలైన సీబీఎస్ఈ 10, 12 తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. 10వ తరగతిలో సాయి హర్ష్‌జి 500 మార్కులకు 494 మార్కులు సాధించాడు. ప్లస్‌టూలో(12)లో తేజస్.కే 500 మార్కులకు 482 మార్కులు సాధించి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారు. ఈ నేపథ్యంలో స్కూల్ డైరెక్టర్ ప్రణీత్ పెనుమాడు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, సిబ్బందిని ఆయన అభినందించారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు 48మంది ఎంపిక



నాయుడుపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి రెజ్లింగ్ అండర్-17 మెన్ అండ్ ఉమెన్ పోటీలు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రోసనూరులో నిర్వహించారు. ఇందులో 48క్రీడాకారులు రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈనెల 16, 17, 18 తేదీల్లో చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను నాయుడుపేట ట్రినేటి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి చైర్మన్ ఆదవరపు నాగూరయ్య, రెజ్లింగ్ అసోసియేషన్ కోశాధికారి ఎ.అభిలాష్, కోచ్‌లు ఇందుజా, లోకేష్, ప్రసాద్ తదితరులు అభినందించారు.

ముగిసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు



చిల్లకూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కలవకొండ లో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. మంగళ వారం స్వామివారికి వసంతోత్సవం, చక్రస్నానం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి స్వామి అమ్మవార్లకు పుష్ప యాగం, ఏకాంతసేవ నిర్వహించారు. ఊసారెడ్డి రాధాక్రిష్ణారెడ్డి, సులోచనమ్మ, చిట్టమూరు శ్రీనివాసులు రెడ్డి, ఉమామహేశ్వరి, కొండా రామ చంద్రారెడ్డి, భవాని, సోమిశెట్టి రామసుబ్బయ్య, రాజ్యలక్ష్మి, మందపాక మురళీరెడ్డి, రాధ, జనార్దనరెడ్డి, అనూష ఉభయ దాతలుగా వ్యవహరిం చారు. ఈవో రవికృష్ణ, ఉత్సవ కమిటీ చైర్మన్ నెల్లటూరు చిరంజీవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

16న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

పుత్తూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 16వ తేదీ శుక్రవారం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. బహుళ జాతి సంస్థలు పాల్గొనే ఈ మేళాను రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్, డీఆర్‌డీఏలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని చెప్పారు. టెన్త్ ఉత్తీర్ణలనుంచి ఇంజనీరింగ్ కోర్సులు వరకు చదివిన ఔత్సాహిక అభ్యర్థులు మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు నెం.6300954441, 6304330520లలో సంప్రదించాలని తెలిపారు.

వెటర్నరీ కళాశాలను పరిశీలించనున్న వీసీఐ బృందం

తిరుపతి రూరల్, మే13(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ కళాశాలను బుధవారం నుంచి వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(వీసీఐ)బృంద సభ్యులు సందర్శించనున్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతి రామయ్య ఈమేరకు తెలిపారు. వీసీఐ మెంబర్, తమిళనాడు సీనియర్ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ తంగవేలు, మహారాష్ట్రకి చెందిన కాలేజ్ ఆఫ్ వెటర్నరీ అండ్ అనిమల్ సైన్సెస్ మైక్రోబయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్పీ అవండ్కర్‌లు మూడు రోజులపాటు కళాశాలలో మౌలిక సదుపాయాలు, బోధన,బోధనేతర సిబ్బంది వంటి అంశాలను పరిశీలిస్తారన్నారు. తిరుపతి కేంద్రంగా నడిచే వర్సిటీ పరిధిలోని గన్నవరం, ప్రొద్దుటూరు, గరివిడి వెటర్నరీ కాలేజీలను కూడా ఇదేతేదీల్లో పలువురు బృంద సభ్యుల సందర్శించనున్నారని సమాచారం. ఐదేళ్లకోసారి వీసీఐ గుర్తింపు కోసం ఈ సాధారణ తనిఖీ జరుగుతుంది.

ఉపాధి పనులు చేస్తూ కూలీ మృతి

వాకాడు, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావిగుంటపాళెం గ్రామానికి చెందిన పావలశెట్టి కలివేలమ్మ(56) మంగళవారం ఉపాధి పనులకు వెళ్లింది. ఎండ తీవ్రతకు తట్టుకోలేక అస్వస్థతకు గురవ డంతో వెంటనే నిడిగుర్తి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెంది నట్లు వైద్యులు చెప్పారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో శ్రీనివాసులు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభు త్వాల నుంచి సాయం అందేలా చూస్తామని చెప్పారు. ఎంపీడీవో వెంట ఏపీవో విజయమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, మల్లికార్జున ఉన్నారు.

విద్యుత్ కార్యాలయ ఉద్యోగి ఆత్మహత్య

గూడూరు అర్బన్, మే 13(ఆంధ్రజ్యోతి): స్థానిక టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు... స్థానిక గాంధీనగర్ సమీపంలోని టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న సుబ్బారావు(43) నెల్లూరులోని విద్యుత్ కార్యాలయంలో సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. కుటుంబకలహాల నేపథ్యంలో మనస్థాపానికి గురైన సుబ్బారావు మంగళవారం ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసు కున్నాడు. గమనించిన కుటుంసభ్యులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానాకి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైలు నుంచి జారిపడి ప్రయాణికుడి మృతి

తడ, మే 13 (ఆంధ్రజ్యోతి): రైల్లో నుంచి జారిపడి ప్రయాణికుడి మృతి చెందిన ఘటన తడ - అక్కంపేట మధ్య మంగళవారం జరిగింది. మృతుడు తెలుపు, నీలిరంగు గళ్ల చొక్కా, నలుపురంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, అంతకుమించి ఎటువంటి ఆధారాలు లభించలేదని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని సూళ్లూరు పేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

రైలు కింద పడి వృద్ధుడి ఆత్మహత్య

శ్రీకాళహస్తి, మే 13(ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడు(60) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ నరసింహులు తెలిపిన వివరాలు... గుర్తు తెలియని వృద్ధుడు మంగళవారం శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం చివరి ప్రదేశంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి శరీరం గుర్తు పట్టలేని విధంగా ఛిద్రమైంది. మృతదేహంపై తెల్లని చొక్క, తెల్లని పంచె, బ్లూ కలర్ డ్రాయర్, ఎరుపురంగు మొలతాడు ఉన్నట్లు తెలిపారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చ్యూరీకి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



వేణు మృతదేహం

శ్రీకాళహస్తి, మే 13(ఆంధ్రజ్యోతి): అనుమానా స్పద స్థితిలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన తొట్టంబేడు మండలంలోని ఇలగనూరు సమీపంలోని తెలుగుగంగ కాలువలో మంగళ వారం జరిగింది. దయనేడు గ్రామానికి చెందిన వేణు(20) ట్రాక్టర్ డ్రైవర్. కొంతకాలం క్రితం తండ్రి మరణించడంతో తల్లితో పాటు నాయుడు పేటకి కాపురం మార్చారు. వారం రోజుల క్రితం మళ్లీ స్వగ్రామానికి వచ్చారు. మరో ముగ్గురు యువకులతో కలిసి వేణు తెలుగుగంగ కాలువలో ఈత కోసం వెళ్లాడు. సాయంత్రం కాలువలో శవమై తేలడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వాస్తవ విరుద్ధ విమర్శలు చేయొద్దు



తిరుపతి రూరల్, మే13(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంటలోని కేవీఎస్ స్పోర్ట్స్ పార్క్‌కు సంబంధించి టీడీపీ నాయకుడు ఈశ్వరరెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికావని గ్రామానికి చెందిన పలువురు మహిళలు పేర్కొన్నారు. మంగళవారం గ్రామంలో రచ్చబండ వద్ద మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. తమ గ్రామాభివృద్ధికి చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. కేవీఎస్ స్పోర్ట్స్ పార్క్‌కు తుమ్మలగుంట వాసులేకాకుండా చుట్టుపక్కల గ్రామాల వారు కూడా వస్తుంటారన్నారు. వాస్తవాలు గ్రహించకుండా విమర్శలు చేయవద్దంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

హోం స్టేల క్రమబద్ధీకరణకు కసరత్తు

● జీఎస్టీ పరిధిలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు ● నేడు నిర్వాహకులతో సమావేశం

తిరుపతి(విద్య), మే 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలోని హోం స్టేలపై వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వీటిని జీఎస్టీ పరిధిలోకి తీసుకువచ్చేందుకు కసరత్తు ప్రారంభించారు. తిరుమల భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో నగరంలో హోంస్టేల సంఖ్య కూడా పెరుగుతోంది. హోటళ్లకంటే చౌకగా, సౌకర్యవంతంగా ఉండటంతో వీటికి గిరాకీ ఏర్పడింది. ఇప్పటికే సుమారు 200 వరకు హోంస్టేలున్నట్టు అధికారులు గుర్తించారు.

ముందుగా అవగాహన... ఆపై చర్యలు



హోంస్టేల నిర్వహకులకు వ్యాపారా లావాదేవీలు, నిబంధనలు, జీఎస్టీపై అవగాహన కల్పిస్తాం. ఈనెల 14న తిరుపతి వాణిజ్య పన్నులశాఖ కార్యాలయంలో హోంస్టేల నిర్వహకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశాం. నిర్వహకులందరికీ జీఎస్టీపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తాం. ఆ తరువాత కూడా జీఎస్టీ రిజిస్ట్రేషన్ తీసుకోకుండా, పన్నులు చెల్లించకుండా నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

-జాన్ స్టీవెన్‌సన్, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్.



జీఎస్టీ రిజిస్ట్రేషన్ లేకుండానే.. : వ్యాపార సముదాయాలైన హోంస్టేలు నిబంధనల ప్రకారం జీఎస్టీ పరిధిలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఏటా రూ.20 లక్షల వాడేలు దాటిన హోం స్టేలు ఈపన్ను పరిధిలోకి వస్తాయి. కానీ చాలామటుకు ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండానే నడుస్తున్నాయి. ఈ క్రమంలో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు హోంస్టేలపై ఫోకస్ పెట్టారు. ఇటీవల తనిఖీలు చేసి ప్రధానమైన 12 హోంస్టేల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అన్నింటినీ పరిశీలించాక జీఎస్టీ పరిధిలోకి ఎన్ని వస్తాయో లెక్కవేయనున్నట్లు సమాచారం.

ముక్కంటి ఆలయ సెక్యూరిటీ గార్డు దౌర్జన్యం

● కమీషన్ కోసం లాడ్జి మేనేజరుతో వాగ్వాదం

శ్రీకాళహస్తి, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు లాడ్జీలో భక్తులు అద్దె గదులు పొందడంపై కమీషన్ ఇవ్వాలంటూ ఓ ముక్కంటి ఆలయ సెక్యూరిటీ గార్డు దౌర్జన్యానికి పాల్పడ్డాడు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో పనిచేసే కొందరు సెక్యూరిటీ గార్డులు భక్తులను అద్దె గదుల కోసం ప్రైవేటు లాడ్జీలకు పంపుతుంటారు. భక్తుల నుంచి అధిక ధరలు వసూలు చేసి నిర్వాహకులు దళారీలుగా వ్యవహరించే సె క్యూరిటీలకు కమీషన్లు చెల్లిస్తుంటారు. అలా ఓ సెక్యూరిటీ గార్డు 2వ గేటు సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు లాడ్జి మేనేజరుతో మంగళ వారం వాగ్వాదానికి దిగాడు. తానుపంపించిన భక్తులు తీసుకున్న అద్దె గది నుంచి కమీషన్ ఇవ్వాలంటూ బూతుల దండకం అందుకు న్నాడు. తాము ఎలాంటి కమీషన్లు ఇవ్వమని మేనేజరు ఎదురుదాడి దిగుతూ ఈ సంభా షణను వీడియో చిత్రీకరించి సామాజిక మా ధ్యమాల్లో పోస్టు చేశాడు. ముక్కంటి ఆలయ సెక్యూరిటీ గార్డు యూనిఫాంలో కమీషన్ కో సం బూతు పదజాలంతో మాట్లాడిన తీరుపై పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి.

ఆ అధికారి తీరు వల్లే...

ముక్కంటి ఆలయంలో కీలక స్థానంలో ఉన్న ఓ అధికారి తీరువల్ల గత ఆరేళ్ల నుంచి సెక్యూరిటీ వ్యవస్థ దళారీకి మారుపేరుగా మారిపోయింది. సంపాదనే ధ్యేయంగా ము క్కంటి ఆలయంలో ఓ అధికారి 2019 వైసీపీ పాలన నుంచి బరితెగించాడన్న అపవాదును మూటగట్టుకున్నాడు. వైసీపీ నేతల నుంచి ఆయనకు పూర్తిమద్దతు ఉండటంతో నాలుగున్నర సంవత్సరాల పాటు ఆయన సెక్యూరిటీ వ్యవస్థను అవినీతిమయంగా మార్చేశారన్న విమర్శలు వెల్లువెత్తాయి. పలు నేరాల్లో భాగస్వాములు అయినవారిని, సెక్యూరిటీకి ఎలాంటి అర్హత లేనివారిని సైతం ఆయన యథేచ్ఛగా నియమించుకున్నాడు. ముక్కంటి ఆలయంలో హుండీ లెక్కింపులో భారీగా చోరీకి పాల్పడి పట్టుబడిన సెక్యూరిటీ గార్డును పదేళ్ల క్రితం అప్పటి అధికారులు తొలగించారు. వైసీపీ పాలనలో అవినీతి అధికారిగా పేరు మోసిన వ్యక్తి హుండీ దొంగను తన అనధికారిక పీఏగా నియమించుకున్నారు. సెక్యూరిటీ వ్యవస్థలో తిరిగి హుండీ చోరీ కేసులో నిందితుడైన వ్యక్తిగా దర్జాగా నియమించుకున్నారు. ఒకరోజు కూడా ఆ సెక్యూరిటీ గార్డు యూనిఫాం ధరించకపోగా వైట్ అండ్ వైట్‌లో వైర్‌లెస్ సెట్‌ను చేతబట్టి కీలక అధికారిగా ఆలయంలో చెలరేగిపోయేవాడు. దీనిపై పెద్దఎత్తున ఫిర్యాదులు వచ్చాయి. దాంతో అధికారి తన అనధికారిక సెక్యూరిటీ గార్డును తాత్కాలికంగా తొలగించారు. ఆయనకు ఉన్న అధికారిక పలుకుబడితో హుండీ చోరీకి పాల్పడిన యువకుడిని సరిగ్గా గత ఏడాది ఎన్నికలకు ముందు ఒప్పంద ఉద్యోగిగా కమిషన్ ఆర్డర్స్‌తో తిరిగి అధికారికంగా నియమించుకున్నారు. ఈ సమయంలో నాలుగున్నరేళ్ల పాటు వైసీపీ పాలనలో భారీగా అవినీతి అక్రమాలకు పాల్పడ్డ ఆ అధికారికి చివరి ఆరు నెలల కాలంలో పంపకాల విషయంలో వైసీపీ నేతలతో విబేధాలు తలెత్తాయి. దాంతో ఆయన్ను గోశాలకు బదిలీ చేశారు. తాను వైసీపీకి వ్యతిరేకినంటూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆ అధికారి మళ్లీ టీడీపీ నేతల పంచన చేరాడు. ఆలయంలోకి పది నెలల క్రితం తిరిగి మళ్లీ తిష్టవేశాడు. అప్పటి నుంచి రెట్టించి అక్రమాలకు పాల్పడుతున్నట్లు తరచూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా ఆయన పరిధిలోని విభాగాల్లో ఉన్న సెక్యూరిటీ వ్యవస్థపై మళ్లీ ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ అధికారి పర్యవేక్షణలో సుమారు తొమ్మిదిసార్లు పలువురు సెక్యూరిటీ గార్డులు భక్తుల నుంచి డబ్బులు వసూలు చేసి దర్జాగా అడ్డదారి దర్శనాలకు వెళుతూ పట్టుబడ్డాడు. ఈ అధికారి అక్రమ వసూళ్ల సెక్యూరిటీ గార్డులకు అండగా నిలబడటంతో ఏ ఒక్కరిపై అప్పట్లో చర్యలు తీసుకోలేదు. ఒక సెక్యూరిటీ గార్డు ప్రైవేటు అద్దె గదెను ప్రోత్సహించడమే కాకుండా కమీషన్ కోసం గొడవకు దిగడం పెద్దఎత్తున చర్చనీయాంశంగా మారింది. ఆరేళ్ల నుంచి అక్రమాలకు అండగాద నిలుస్తున్న అధికారిపై దేవదాయశాఖ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అక్రమ కట్టడం కూల్చివేత

పెట్రోల్ పోసుకుని మహిళ ఆత్మహత్యాయత్నం

అడ్డుకున్న పోలీసులు



ఒంటిపై పెట్రోల్ పోసుకున్న వెన్నెలను అడ్డుకుంటున్న సీఐ బాబీ, ఎస్ఐ ఆదిలక్ష్మి, పోలీస్ సిబ్బంది

నాయుడుపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పొగగొట్టం కాలనీలో అక్రమంగా నిర్మిస్తున్న భవనాన్ని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ అధికారులు మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేశారు. పొగగొట్టంకాలనీ ప్రాంతంలోని దాదాపు 18.57 ఎకరాలను 11 మంది రైతులు కొన్నేళ్లుగా సాగుచేసుకుంటున్నారు. ఈ క్రమంలో అక్కడ శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. సదరు భూములు తమకు చెందినవంటూ వెంకటగిరి రాజా వీఎస్‌జీ యాచేంద్ర హైకోర్టును ఆశ్రయించారు. రైతులు కూడా కౌంటర్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో పొగగొట్టంకాలనీ ప్రాంతంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని హైకోర్టు స్టే మంజూరు చేసింది. ఇటీవల కావేరిపాకం లోకేష్ భవన నిర్మాణం చేపట్టడంతో మున్సిపల్ అధికారులు అడ్డుకు న్నారు. మళ్లీ నిర్మాణం కొనసాగిస్తుండడంతో మంగళవారం కమిషనర్, పోలీసు, రెవెన్యూ అధికారులు పొగగొట్టంకాలనీకి చేరుకుని భవనాన్ని కూల్చివేశారు. ఈ క్రమంలో లోకేష్ బంధువు కావేరిపాకం వెన్నెల అనే మహిళ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా యత్నం చేయడంతో సీఐ బాబీ, ఎస్ఐ ఆదిలక్ష్మి, పోలీస్ సిబ్బంది అడ్డుకున్నారు.

లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి అందజేత



ఃచెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

వడమాలపేట, మే 13(ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురై ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్న బాధితులకు అం డగా తానున్నానంటూ ఎమ్మె ల్యే గాలి భానుప్రకాష్ ఆపన్న హస్తం అందించారు. మండలం లో నలుగురికి వారి ఇళ్లకే వెళ్లి సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. మంగళవారం మండలంలోని కాయం దళిత వాడలో భాగ్యలక్ష్మికి రూ.1,32,941, కాయం గ్రామంలో నారాయణరెడ్డికి రూ.74,670, పూడిలో జానకిరామయ్యకు రూ.36,608, కదిరిమంగళంలో దామోదరానికి రూ.1,00,322 చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ధనంజయులునాయుడు, నాయకులు ఉమాపతిరావు, వెంకటేష్ యాదవ్, వెంకట్రామనాయుడు, దొరస్వామి, బత్తినాయుడు పాల్గొన్నారు.

సింహ, ముత్యపు పందిరి వాహనాలపై కల్యాణ వెంకన్న విహారం





సింహ, ముత్యపుపందిరి వాహనాలపై పురవిహారం చేస్తున్న కల్యాణ వెంకన్న

నారాయణవనం, మే 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మావతి దేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం స్వామివారు సింహవాహనంపై, రాత్రి ముత్యపు పందిరి వాహనంపై విహరిస్తూ భక్తులపై వరాలజల్లు కురిపించారు. వేకువ జామున 5 గంటల నుంచి సుప్రభాతసేవ సహా నిత్య పూజా కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పుష్పాలు, సర్వాభరణాలతో అలంకరించి సింహ వాహనంపై అధిష్ఠింపజేశారు. మేళతాళాలు, వేదమంత్రాలు, గోవింద నామ స్మరణల నడమ స్వామివారిని గ్రామంలో ఊరేగించారు. ఆలయానికి చేరుకున్న స్వామి వారికి ఉభయనాంచారులతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం నిత్య పూజల అనంతరం స్వామివారికి ఊంజలసేవ నిర్వహించారు. రాత్రి 7.30 గంటలకు ముత్యపు పందిరి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఊరేగింపులో స్వామి వారికి, భక్తులు మంగళ హారుతులు, కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఉత్సవాల ఏర్పాట్లను డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీధర భట్టాచార్య, ఆలయ సిబ్బంది తదితరులు పర్యవేక్షించారు.

ఉపాధి హామీ కూలీలకు బీమా భరోసా..!



బీమా నమోదుపై అవగాహన కల్పిస్తున్న ఏపీవో జ్యోతిశ్రీ

తిరుపతిరూరల్, మే13(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు ప్రమాద బీమా ద్వారా భరోసానిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పీఎం సురక్షణ యోజన, పీఎం జీవనజ్యోతి బీమా యోజన పథకాలను వర్తింపజేయాలని నిర్ణయించింది. గుండెనొప్పి, వడదెబ్బ, పాము కాటు తదితర కారణాలతో మరణిస్తే నామినీలకు బీమా ద్వారా రూ.2లక్షల నష్టపరిహారం లభిస్తుంది. శాశ్వత అంగవైకల్యం చెందితే రూ.లక్ష వస్తుంది. బీమా నమోదుకు దరఖాస్తులు స్వీకరించి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉత్తర్వులు జారీ చేసింది.

7800మందికి జాబ్‌కార్డులు

రూరల్ మండలంలో7,800మందికి జాబ్‌కార్డులు ఉన్నాయి. 22 పంచాయతీల్లో ఉపాధి హామీ కింద మట్టి పనులు జరుగుతున్నాయి. మిగిలిన పంచాయతీల్లో హౌసింగ్, అవెన్యూ ప్లాంటేషన్(రోడ్డుపక్కన చెట్లకి నీరుపట్టడం), సీసీ రోడ్లు, హార్టికల్చర్ విభాగ పనులు చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 2,800మందికి పని కల్పించినట్లు ఏపీవో జ్యోతిశ్రీ పేర్కొన్నారు.

బీమా పథకాలకు అర్హత ఇదీ:

పీఎం సురక్ష బీమా యోజన పథకానికి 18-70ఏళ్ల మధ్య వయసున్నవారు, పీఎం జీవనజ్యోతి బీమా యోజన కింద 18-50 సంవత్సరాల మధ్య వయసున్నవారు అర్హులు. పీఎం సురక్ష బీమాకు రూ.20, జీవనజ్యోతికి రూ.436 జాతీయ బ్యాంకులో చెల్లించాలి. ఇప్పటికే 3500మందికిపైగా బీమా నమోదు చేసుకున్నారని ఏపీవో జ్యోతిశ్రీ తెలిపారు. ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

టీడీపీ రణధీరపురం పంచాయతీ అధ్యక్షుడిగా చంద్రశేఖర్



తిరుపతి అర్బన్, మే 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ రణధీరపురం గ్రామ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా ఎం.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా అశోక్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా జె.నాగరాజు, తెలుగు మహిళా అధ్యక్షురాలిగా సుశీల, తెలుగు యువత అధ్యక్షుడిగా సి.వెంకటేష్, ఐ.టీడీపీ అధ్యక్షుడిగా వి.నాగార్జున, బీసీ సెల్ అధ్యక్షుడిగా ఎన్.గంగాధరం, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఎం.రమణ, ప్రధాన కార్యదర్శిగా కె.సురేంద్ర, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా వి.చలపతి, మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా కాసింబాషా ఎన్నికయ్యారు.

సీబీఎస్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



అధికారులతో సమీక్షిస్తున్న డీపీటీవో వెంకటరావు

తిరుపతి(ఆర్టీసీ), మే 13 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బస్సుస్టేషన్‌లోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డీపీటీవో వెంకటరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆయన సీబీఎస్‌లో కలయతిరిగి ప్రయాణికులకు అందుతున్న సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఏటీఎం కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఉచిత టాయిలెట్స్ ఆధునీకరించాలన్నారు. పల్లెవెలుగు బస్టాండులో తాగునీరు ఏర్పాట్లు చేయాలన్నారు. ఆవరణంలో ఉన్న బెంచ్‌లకు రంగులు వేయాలని, సెన్‌ఫోన్ రీచార్జ్ పాయింట్లను పెంచాలని, పాడైనవాటిని మరమ్మతులు చేయించాలని సూచించారు. ప్రతి రెండు పిల్లర్స్‌కు ఓ ప్లాస్టిక్ చెత్తకుండీ ఏర్పాటు చేయాలని, తరచూ కవర్స్ తొలగించాలని, వారానికోసారి నీటితో శుభ్రం చేయించాలని, ప్రతి దుకాణం ముందు డస్ట్‌బిన్ ఏర్పాటు చేయించాలన్నారు. విచారణ కేంద్రాల సిబ్బంది ఆర్టీసీ యాప్‌లపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. భద్రత దృష్ట్యా మరిన్ని సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, ఏటీఎం రామచంద్రనాయుడు, డీఈ చెన్నకేశవులు, ఈఈ లక్ష్మీనారాయణ, సంధ్యారాణి పాల్గొన్నారు.

రెడ్డీస్ భారత్ ఆధ్వర్యంలో అన్నదానం



అన్న ప్రసాదాల వితరణ కార్యక్రమానికి హాజరైన మబ్బు సూర్యనారాయణరెడ్డి, దుగ్గాండ్ల పురుషోత్తంరెడ్డి, మబ్బు దేవనారాయణరెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు

తిరుపతి(జీవకోన), మే 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతరను పురస్కరించుకుని మంగళవారం రెడ్డీస్ భారత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గంగమ్మ ఆలయ పరిసర ప్రాం తంలోని హరణి టవర్స్ వద్ద భక్తుల కోసం అన్నాదానం చేశారు. రెడ్డీస్ భారత్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మునీశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బ్లిస్ హోటల్ అధినేత మబ్బు సూర్యనారాయణరెడ్డి, దుగ్గాండ్ల పురుషోత్తంరెడ్డి, టీడీపీ నేత మబ్బు దేవనారాయణరెడ్డి, బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. హాజరైన ముఖ్య అతిథులను అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

అన్నమయ్యలో బాల్యం నుంచే భక్తి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మేడసాని మోహన్ చిత్రంలో తాళ్లపాక హరినారాయణాచార్యులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 13 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్యలో బాల్యం నుంచే భక్తి భావాలున్నాయని అన్నమయ్య వంశీయులు తాళ్లపాక హరినారాయణాచార్యులు పేర్కొన్నారు. టీటీడీ అన్నమయ్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో చేపట్టిన అన్నమాచార్యుల 617 వ జయంతి ఉత్సవాల్లో భాగంగా తిరుపతిలో గల అన్నమాచార్య కళా మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో మంగళవారం వారు ప్రసం గించారు. శ్రీవారి ఆలయంలో కల్యాణోత్సవం అన్నమయ్య ప్రవేశపెట్టిన విధానమేనని తెలిపారు. సభాధ్యక్షత వహించిన ఆచార్య సర్వోత్తమరావు మాట్లాడుతూ అన్నమయ్య ఆలయ కవిగా, అనుభూతి కవిగా, సామాజిక కవిగా పేర్కొనవచ్చని అభిప్రాయ పడ్డారు. ఎంతో మంది కవులు అన్నమయ్య నుంచే స్ఫూర్తి పొందా రని తెలిపారు. విశ్రాంత టీచర్ శ్రీరాములు మాట్లాడుతూ మోక్ష సాధనకు భక్తి ఉత్తమమైనదిగా అన్నమయ్య భావించారని తెలి పారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారిణి బుల్లెమ్మ బృందం సాయం త్రం చేపట్టిన సంగీత కచేరి ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి డాక్టర్ మేడసాని మోహన్, ప్రోగ్రాం అసిస్టెంట్ లత, అధికారులు, సిబ్బంది, కళాకారులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ప్రసవాలను పెంచాలి

తిరుపతి(కలెక్టరేట్), మే 13(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీలో ప్రసవాలను పెంచాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు అన్నారు. విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో మంగళవారం జిల్లా అధికారులతో సమీక్షించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండ్యన్ ఈ సమీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీడీ సర్వే వేగవంతం చేయాలని ఆదేశించారు. మాతాశిశు మరణాలను నివారించేందుకు కృషి చేయాలన్నారు.

రెండు పాముల పట్టివేత



పట్టుబడిన నాగుపాము

తిరుమల, మే13(ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం రెండు పిల్ల పాములు పట్టుబడ్డాయి. వీఐపీలు బస చేసే హరిహర సదన్ వద్ద మూడు అడుగుల పొడవైన నాగుపాము, ఆర్బీ సెంటర్ వద్ద మరో మూడు అడుగుల పొడవైన జెర్రిపోతు పాము ఉన్నట్టు సమాచారం రావడంతో టీటీడీ ఉద్యోగి భాస్కర్‌నాయుడు చేరుకుని చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ పాములను దట్టమైన అడవిలో విడిచిపెట్టారు.

టెన్త్ సీబీఎస్ఈలో లిటిల్ ఏంజల్స్ విజయకేతనం



వరుసగా(హేమస్వరూప్, వికాస్, భావజ్ఞ)

తిరుపతి(విద్య), మే13(ఆంధ్రజ్యోతి): టెన్త్ సీబీఎస్ఈ పరీక్షా ఫలితాల్లో యశోదనగర్‌లోని లిటిల్ ఏంజల్స్ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారని ప్రిన్సిపాల్ పద్మశ్రీ పేర్కొన్నారు. వి.హేమస్వరూప్ 500కి 492 మార్కులు, పి.వికాస్ 489, బి.భావజ్ఞ 488మార్కులతో టాపర్స్‌గా నిలిచారని వెల్లడించారు. అలాగే పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత నమోదు చేసిందని వివరించారు. ప్రతిభచాటిన విద్యార్థులను కరస్పాండెంట్ కె.రాజగోపాల్‌రెడ్డి, ఛైర్‌పర్సన్ ఎం.రమాదేవి, డైరెక్టర్ డాక్టర్ కేఆర్ శ్వేత, టీచర్లు అభినందించారు.

తిరుపతి

రెచ్చిపోయిన గొలుసు దొంగలు

● జాతరలో ఐదు ఘటనలు

● పట్టుకున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మే 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి గంగ జాతరలో గొలుసు దొంగలు రెచ్చిపోయారు. మంగళవారం జరిగిన ఐదు ఘటనల్లోనూ దుండగులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరంతా బిట్రగుంట బ్యాచ్ అని చెబుతున్నారు. తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం నేతృత్వంలో గంగమ్మ గుడి వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు, పిక్ ప్యాకెట్లు, మొబైల్ చోరీలు జరగకుండా దాదాపు 26 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటితో పాటు 20 మంది క్రైం పోలీసులతో మఫ్టీ నిఘాలో ఐడీ పార్టీని నియమించారు. వీరు నిరంతరం బయట తిరుగుతూ అనుమానం వున్న వారిపై నిఘా ఉంచారు. దీంతో గొలుసు దొంగలను పట్టుకోగలిగారు.

● తిరుపతికి చెందిన సుహాసిని మంగళవారం గంగమ్మ దర్శనానికి రాగా ఆలయంలో బిట్రగుంటకు చెందిన మహిళా దుండగురాలు ఆమె మెడలోని 25 గ్రాముల బంగారు గొలుసు లాగింది. అక్కడే ఉన్న ఐడీ పార్టీ పోలీసులు గమనించి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. బంగారు గొలుసు రికవరీ చేశారు.

● ఉచిత దర్శనం క్యూలైన్‌లో ఉన్న ఇద్దరు మహిళల మెడల నుంచి బంగారు చైన్లు లాక్కొని పరారైన వారిని వెంటనే పోలీసులు సీసీ కెమెరాల్లో పరిశీలించి పట్టుకున్నారు. వారి నుంచి నగలు రికవరీ చేశారు.

● ఇక చైన్ స్నాచింగ్ చేస్తున్న రేణిగుంటకు చెందిన నాగలక్ష్మిని పోలీసు ఐడీ పార్టీ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు.

● తిరుపతికి చెందిన పూర్ణిమ నుంచి మూడు సవర్ల బంగారు చైను లాగుతున్న డీసీకు చెందిన కావడి గంగమ్మను అదుపులోకి తీసుకున్నారు. పట్టుకుని చైను తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్నారు.

● ఇక, మంగళవారం రాత్రి ఏడు గంటల ప్రాంతంలో మూడు మొబైల్ ఫోన్లు కొట్టేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వీరికి దేహశుద్ధి చేసి ఈస్ట్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.





గంగమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఆరణి కుటుంబీకులు - మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ



అమ్మవారి సేవలో కమిషనరు మౌర్య





ఎస్పీ హర్షవర్ధనరాజు



రోజా



మాజీ మంత్రి పెద్దిరెడ్డి



మేయర్ శిరీష



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

మమ్మల్ని దర్శనానికి ఎందుకు పంపరు?

గంగమ్మ గుడి గేటు వద్ద భక్తుల వాగ్వాదం ● రాత్రి 11 గంటలకు గేట్లు వేసిన అధికారులు



గేటు బయట భక్తులు - పోలీసులతో వాగ్వాదం

తిరుపతి (నేరవిభాగం)/ఎంఆర్‌పల్లె, మే 13(ఆంధ్రజ్యోతి): తమను దర్శనానికి ఎందుకు పంపరంటూ కొందరు భక్తులు పోలీసులలో వాగ్వాదానికి దిగారు. దీంతో గంగమ్మ గుడి వద్ద కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. వివరాలిలా ఉన్నాయి. జాతర ముగిసిందంటూ తాతయ్యగుంట గంగమ్మ ఆలయఅధికారులు రాత్రి 11గంటల సమయంలో గేట్లు మూసేశారు. అదే సమయంలో దక్షిణం వైపు గేటు బయట కొందరు భక్తులున్నారు. తమను దర్శనానికి పంపించాలంటూ పోలీసులతోవాగ్వాదానికి దిగారు.దర్శన సమయం అయిపోయిందని, విశ్వరూపదర్శనంకోసం అమ్మవారి ప్రతిమ తయారు చేస్తున్నామని అధికారులు చెప్పారు. భక్తులు వినిపించుకోలేదు. అదే సమయంలో టీడీపీ నేత కృష్ణయాదవ్ అక్కడికి చేరుకుని భక్తులను దర్శనానికి ఎందుకు అనుమతించడం లేదని అడిగారు. సమయం అయిపోయిందని ఆయనకు పోలీసులు చెప్పారు. అదే సమయంలో కొందరు 'పోలీసులు డౌన్ డౌన్' అంటూ అరిచారు. భక్తులతో పాటు ఉన్న కొందరు మందుబాబులు రెచ్చిపోయి గేట్లు తోసుకుని ముందుకు దూసుకురావడంతో ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితి చేయిదాటుతుండటంతో పోలీసులు లాఠీచార్జీ చేశారు. ఇద్దరు మందుబాబులను అదుపులోకి తీసుకుని ఈస్ట్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత రోప్ పార్టీ వాళ్లు వచ్చి నియంత్రించారు. తమను దర్శనానికి పంపిస్తేనే ఇక్కడ్నుంచి కదలతామంటూభక్తులు భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో ఉద్రిక్తత కొనసాగింది. చివరకు ఎస్టీఎఫ్ బలగాలూ అక్కడికి చేరుకున్నాయి. కాగా, గతేడాది 11.30 గంటల వరకు దర్శనానికి అనుమతించారని, ఈసారి ఆలయాధికారులు 11 గంటలకే గేట్లు మూసేయడం ఏంటని కొందరు భక్తులు పేర్కొన్నారు.





విశ్వరూప ప్రతిమ తయారీని ఆపేసి కిందకు దిగి నిర్వాహకులతో తయారీదారుల వాగ్వాదం

కాసేపు 'బ్రేక్'

తాతయ్యగుంట గంగమ్మ గుడిలో విశ్వరూప ప్రతిమ తయారీకి 25 నిమిషాలు బ్రేక్ పడింది. మంగళవారం రాత్రి ప్రతిమ తయారీ పనులు చేపట్టారు. తమ కుటుంబీకులను లోపలకు అనుమతించలేదంటూ తయారీదారులు అలిగి రాత్రి 12.25 గంటల సమయంలో ప్రతిమ తయారీని ఆపేసి కిందకు దిగేశారు. అక్కడి వారితో వాగ్వాదానికి దిగారు. చివరకు 12.50 గంటల ప్రాంతంలో వీరి సమస్య సర్దుబాటైంది. ఆ తర్వాత ప్రతిమ తయారీ పనులు చేపట్టారు.

శివారు ప్రాంతాల్లో పెరిగిన దొంగతనాలు

నిన్న చిగురువాడ - నేడు పుదిపట్ల, శ్రీకృష్ణనగర్‌లో చోరీలు



తిరుపతి రూరల్ పుదిపట్లలో జరిగిన చోరీ ఇంటిని పరిశీలిస్తున్న సీఐ

తిరుపతి(నేరవిభాగం) మే13(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రకు చెందిన దొంగల ముఠా జాతీయ రహదారిని అనుకుని వున్న తిరుపతి రూరల్, శివారు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని చోరీలు చేస్తోంది. లక్షలాది రూపాయలు బంగారు నగలు, నగదు, విలువైన వస్తువులు దోచుకుంటున్నారు. ● ఆదివారం రాత్రి తిరుపతి రూరల్ మండలం చిగురువాడకు చెందిన చొక్కారెడ్డి నరేంద్రకుమారి ఇంట్లో 76 గ్రాముల బంగారు నగలు కాజేశారు. ● సోమవారం రాత్రి పుదిపట్లలోని భీమా పద్మావతి తిరుమలలోని ఓ ప్రైవేటు హోటల్లో పనిచేస్తోంది. ఈమె వారానికి ఒకసారికి ఇంటికి వచ్చి వెళుతుండేది. సోమవారం ఇంటికి వచ్చి సాయంత్రం తిరుమలకు వెళ్లింది. ఈ క్రమంలో దొంగలు ఆమె ఇంట్లోకి ప్రవేశించి 32 గ్రాముల బంగారు చైనును చోరీచేశారు. మంగళవారం పక్కింటి వారు గుర్తించి ఆమెకు సమాచారం అందించారు. ఆమె వచ్చి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ చిన్నగోవిందు కేసు నమోదు చేశారు. ● తిరుపతి ఎస్వీయూ పోలీసు స్టేషన్ పరిధిలోని శ్రీకృష్ణనగర్‌లో ఉంటున్న రిటైర్డు కోర్టు సూపరింటెండెంట్ దొరస్వామి కుటుంబసభ్యులంతా సోమవారం చిత్తూరుకు వెళ్లారు.మంగళవారం తెల్లవారుజామున వారింట్లో దొంగలు పడ్డారు. నాలుగు జతల కమ్మలు, మూడు రింగులు, రూ.20వేలు నగదు దోచుకున్నారు.ఇంటిలో పనిచేసే రామ్మూర్తి గమనించి యజమానికి తెలియచేశాడు. వారు మంగళవారం ఎస్వీయూ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ రామయ్య కేసు నమోదు చేశారు.

నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు రూ.10లక్షలు



ఎన్డీఎఫ్‌కు జమచేసిన ధ్రువీకరణ పత్రాలను చూపుతున్న దాతలు

తిరుపతి అర్బన్, మే 13(ఆంధ్రజ్యోతి): నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు తిరుపతికి చెందిన దాతలు మంగళవారం రూ.10లక్షలు విరాళంగా అందజేశారు. ఎయిర్ బైపాస్ రోడ్డులోని కేవీఆర్ జ్యువెలరీస్ అధినేతలు కె.ఆర్.నారాయణమూర్తి, కె.ఎన్.రామకృష్ణ, కె.ఎన్.శ్రీనివాస్ ఆన్‌లైన్ ద్వారా ఎన్డీఎఫ్ ఖాతాకు ఈ మొత్తాన్ని జమ చేశారు. దేశసరిహద్దుల్లో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తున్న సైనికుల సంక్షేమం కోసం విరాళాలు అందించేందుకు ముందుకురావాలని వీరు కోరారు.

కాఫీ పౌడర్‌తో వీరజవాన్ చిత్రం



తిరుపతి(కలెక్టరేట్), మే 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల 'ఆపరేషన్ సిందూర్'లో అసువులు బాసిన వీరజవాన్ మురళీ నాయక్ చిత్రాన్ని చిత్రకారుడు చిరంజీవి కాఫీ పొడితో చిత్రించారు. ఈ చిత్రాన్ని మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందజేశారు.

ప్రధానికి దైవబలం మెండుగా ఉండాలని ప్రార్థించా

● ఎమ్మెల్యే ఆరణి



తిరుత్తణి కొండపై జాతీయజెండా ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే బృందం

తిరుపతి అర్బన్, మే 13(ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర్' ద్వారా పాకిస్థాన్‌కు గుణపాఠం నేర్పిన సైనికులకు, దేశాన్ని ఏకతాటిపై నిలిపిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆశీస్సులు మెండుగా ఉండాలని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం తిరుపతి నుంచి జనసైనికులు తిరుత్తణి సుబ్రహ్మణ్యంస్వామి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, సుభాషిణీ, కీర్తన, వెంకటేశ్వరరావు, యుగంధర్, బాలసుబ్రహ్మణ్యం, నరసింహాచ్చారి, నరేంద్ర, ఎస్కేబాబు, రేవతి, దూదికుమారి, పొన్నాలచంద్ర, కుడితి సుబ్రహ్మణ్యం, నారాయణ, వేణుగోపాల్, శివకుమార్, యాదవకృష్ణ, రవి, హరిశంకర్, వనజ, బాబ్జి, రాజేష్‌యాదవ్, పగడాల మురళీ, కృష్ణప్రసాద్, సుధాకర్, మహేష్, లక్ష్మీపతి, మునస్వామి, రాజేష్‌ఆచారి తదితరులు పాల్గొన్నారు.



మొదటి ఘాట్‌లో అవ్వాచారి కోన వద్ద ఏర్పాటు చేసిన సోలార్ సీసీ కెమెరా

తిరుమల ఘాట్‌లోనూ
సోలార్ సీసీ కెమెరాలు

తిరుమల, మే13(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భద్రతను కట్టుదిట్టం చేయడంలో భాగంగా ఘాట్ రోడ్లు సహా పలు ప్రాంతాల్లో సోలార్ సీసీ కెమెరాలను అమర్చారు. ప్రస్తుతం తిరుమల శ్రీవారి ఆలయం, వైకుంఠం క్యూకాంప్లెక్సులు, క్యూలైన్లు, అన్నప్రసాద భవనం, లడ్డూ కౌంటర్, కల్యాణకట్టలు, గదుల కేటాయింపు కేంద్రాలు, యాత్రికుల వసతి సముదాయాలు, అలిపిరి, జీఎన్సీ టోల్‌గేట్ వంటి ప్రాంతాలతో పాటు లేపాక్షి, రాంభగీచ, వరాహస్వామి వంటి ప్రాంతాల్లో దాదాపు 2,780 సీసీ కెమెరాలు ఉన్నాయి. పీఏసీ-4లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని వీడియో వాల్ ద్వారా వీటిని పరిశీలిస్తుంటారు. విశేష పర్వదినాల్లో అదనంగా కొన్ని ప్రాంతాల్లో కెమెరాలను ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో సీసీ కెమెరాలను తిరుమల సరిహద్దుల దాకా విస్తరించాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధనరాజు అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగా తిరుమల ఘాట్ రోడ్లు, పార్వేటమండపం, శ్రీవారిమెట్టు వంటి సరిహద్దు ప్రాంతాల్లోనూ సోలార్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. తొలివిడతలో 15 సోలార్ కెమెరాలను అమర్చారు. విద్యుత్‌తో అవసరం లేకుండా కేవలం సౌరశక్తితో ఇవి పనిచేయనున్నాయి. వీడియోతో పాటు ఆడియో టెక్నాలజీతో పనిచేసే ఈ సీసీ కెమెరాల ఫుటేజ్‌ను వైర్‌లెస్ కనెక్టివిటీతో ఎక్కడి నుంచైనా స్మార్ట్‌ఫోన్ ద్వారా వీక్షించవచ్చు. వీటి పనితీరు మంచి ఫలితాలు ఇస్తే తిరుమల చుట్టూ మరిన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.


సర్వదర్శనానికి 5 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 5 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 2 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.90 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,760

తలనీలాలు సమర్పించినవారు: 29,361







గంగమ్మకు నీరాజనం

తిరుపతి గంగ జాతరకు భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనానికి మంగళవారం వేకువజామునుంచే వచ్చారు. పొంగళ్లతో మొక్కులు తీర్చుకున్నారు. మిగతా గంగమ్మలనూ దర్శించుకున్నారు. ఇలా తరలివచ్చిన భక్తజనంతో గంగమ్మ ఆలయాలు కిటకిటలాడాయి.





పీఎండీఎస్ సాగు పెంచాలి

తిరుపతి(కలెక్టరేట్), మే 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఎండీఎస్ (తొలకరికి ముందే విత్తడం) సాగును పెద్దఎత్తున చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో పీఎండీఎస్ సాగుపై వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులతో సమీక్షించారు. పీఎండీఎస్ విత్తనాల కిట్‌ను పరిశీలించి సాగు విధానం గురించి తెలుసుకున్నారు. పీఎండీఎస్ విత్తనాల కిట్‌కు 30 రకాల పంట విత్తనాలు కలిపి తయారు చేస్తారన్నారు. ఎకరాకు 10-15 కిలోల విత్తనాలు విత్తుకోవాలన్నారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు 50వేల కిట్లు లక్ష్యంగా చేసుకుని రైతులకు సరఫరా చేయాలన్నారు. వరి నాట్లకు ముందు, మామిడి కోతల తరువాత ప్రతి రైతు తప్పనిసరిగా పీఎండీఎస్ విత్తనాలు చల్లుకోవాలని సూచించారు. దీంతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు, ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, జిల్లా పథక మేనేజరు షణ్ముగం పాల్గొన్నారు.

హిందువుల మనోభావాలను దెబ్బతీస్తారా?

- ‘డీడీ నెక్స్ లెవల్’ తమిళ సినిమాపై తిరుమల పోలీసులకు ఫిర్యాదు



తిరుమలలో తమిళనాడు మాజీ సీఎం పళని స్వామికి వినతి పత్రం ఇస్తున్న కిరణ్ రాయల్

తిరుమల, మే13(ఆంధ్రజ్యోతి): ‘డీడీ నెక్స్ లెవల్’ అనే తమిళ సినిమాలో ‘శ్రీనివాస గోవింద’ అనే పాట హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ఉందంటూ జనసేన నేత కిరణ్‌రాయల్ తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ పాట వీడియోను కూడా ఫిర్యాదుతో పాటూ ఎస్‌ఐ రమేష్‌కు అందజేశారు. అనంతరం కిరణ్ రాయల్ మీడియాతో మాట్లాడుతూ, ‘శ్రీనివాస గోవిందా’ అనే పాటను రీమిక్స్ చేసి సినిమాలో క్లబ్ డ్యాన్స్‌గా మార్చారన్నారు. దీనిపై తమిళనాడులోని హిందువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ సెన్సార్ బోర్డు అనుమతి ఇచ్చిందన్నారు. తమకు ప్రభుత్వ సహకారం కూడా ఉందని సినిమా బృందం సభ్యులు చెప్తున్నారన్నారు. తమిళనాడు ప్రభుత్వం నాస్తికుల ప్రభుత్వమన్నారు. దీన్ని హిందూ సమాజంపై కుట్రగానే భావిస్తున్నామన్నారు. ఆ సినిమాను బ్యాన్ చేయకుండా తమిళనాడు నుంచి నాయకులు తిరుమలకు వచ్చి పూజలు చేస్తామంటే ఒప్పుకోమన్నారు. కాగా శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన తమిళనాడు రాష్ట్ర ప్రతిపక్ష నేత, మాజీ సీఎం పళణిస్వామిని మంగళవారం కిరణ్‌రాయల్ కలిసి, భక్తుల మనోభావాలు కాపాడేందుకు సహకరించాలని కోరారు.

త్వరలో రుయాలో సిటీ డయాగ్నొస్టిక్ సెంటర్

తిరుపతి(కలెక్టరేట్), మే 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రుయాస్పత్రిలో త్వరలో సిటీ డయాగ్నొస్టిక్ సెంటర్ ప్రారంభిస్తామని ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండ్యన్, కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సిటీ డయాగ్నొస్టిక్ సెంటర్‌పై వైద్యులు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. డయాగ్నొస్టిక్ సెంటర్ అందుబాటులోకి వస్తే 136 రక్త, మూత్ర ఇతర ముఖ్యమైన పరీక్షలు చేసే అవకాశం ఉంటుందన్నారు. తిరుపతి నగరంతో పాటు పరిసర ప్రాంతాల్లోని 20 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల నుంచి వచ్చే రోగులకు ఈ కేంద్రంలో పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్ రాధ ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.



వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ వీరపాండ్యన్, కలెక్టర్ వెంకటేశ్వర్

వాడివేడిగా జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

- కోరం లేకుండానే రెండో కమిటీ సమావేశ నిర్వహణ
- పీఆర్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖల అధికారులను నిలదీసిన సభ్యులు





సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈవో రవికుమార్ నాయుడు - హాజరైన సభ్యులు, అధికారులు

చిత్తూరు రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి):చిత్తూరులోని జడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశాలు వాడివేడిగా సాగాయి.మొత్తం 7 కమిటీల సమావేశాల్లో రెండో కమిటీ సమావేశాన్ని కోరం లేకుండానే పూర్తిచేశారు.6వ కమిటీ సమావేశానికి జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, 5వ కమిటీకి స్త్రీ, శిశు సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, తవణంపల్లె జడ్పీటీసీ భారతి, 3వ కమిటీకి వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి అధ్యక్షత వహించాల్సి ఉండగా వారు గైర్హాజరయ్యారు. అన్ని సమావేశాలకూ జడ్పీ చైర్మన్ శ్రీనివాసులే అధ్యక్షత వహించారు.1వ కమిటీ సమావేశంలో పాల్గొన్న సభ్యులే మిగిలిన కమిటీ సమావేశాల్లో పాల్గొనడం చర్చనీయాంశమైంది.సమస్యలపై చర్చలు తప్ప పరిష్కరించడం లేదని పలు శాఖల అధికారుల తీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత రెండు మూడు సమావేశాల్లో చర్చించిన సమస్యలను ఇంతవరకూ పరిష్కరించలేదని ఆరోపించారు.

బీసీ హాస్టళ్లలో ఈబీసీలకూ అవకాశం కల్పించండి:జడ్పీ చైర్మన్ సూచన

బీసీ హాస్టళ్లలో మిగిలిన సీట్లను వృధా కాకుండా ఈబీసీలకు అవకాశం కల్పించమని బీసీ సంక్షేమ అధికారులకు జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సూచించారు. వి.కోట బీసీ బాలికల హాస్టల్‌లో విద్యుత్ దీపాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. వేరుశనగ విత్తనాల పంపిణీ ఆలస్యమవుతోందనగా గతేడాది 43 వేల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేయగా.. ఈ ఏడాది అందులో సగం మాత్రమే జిల్లాకు కేటాయించారని, ఈ నెలలో పంపిణీ ప్రారంభిస్తామని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. దీనిపై జడ్పీ చైర్మన్ ఉన్నతాధికారులతో మాట్లాడి గతం కన్నా ఈ ఏడాది అధికంగా పంపిణీ చేయాలని సూచించారు.●రామసముద్రం మండలంలో అసంపూర్ణంగా వున్న గ్రామ సచివాలయాల భవనాలను పూర్తి చేయాలని జడ్పీటీసీ రామచంద్రారెడ్డి కోరారు.ఆర్.నడింపల్లె కొండపై 9 నెలల కిందట వాలీశ్వరస్వామి దేవస్థానానికి వెళ్లేందుకు రూ.2 కోట్లతో రోడ్డు పనులు మొదలుపెట్టి చదును చేసి వదిలిపెట్టారని, వర్షం పడినప్పుడల్లా రోడ్డులోని మట్టి కొట్టుకుపోతోందన్నారు.జడ్పీ గ్రాంట్ కింద సుమారు రూ.45 లక్షలు వాటర్ వర్క్స్ కోసం మంజూరవగా.. రూ.1.20 లక్షలు మాత్రమే ఖర్చు చేశారని సభ దృష్టికి తీసుకొచ్చారు.●నారాయణవనం మండలంలోని ఎరుకంబట్టు, గోవిందప్పనాయుడు కండ్రిగ, సుబ్బానాయుడు కండ్రిగ, తుంబూరు, పాలమంగళం పంచాయతీల్లో రోడ్లపై కంకరవేసి వదిలిపెట్టారని, దీంతో రాత్రివేళల్లో ప్రయాణికులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని జడ్పీటీసీ సుమన్‌కుమార్ చెప్పారు.తారు రోడ్డు వేసి సమస్యను పరిష్కరించాలని కోరారు.●వడమాలపేట జడ్పీటీసీ మురళి మాట్లాడుతూ 2015లో రూ.11 లక్షలతో అభివృద్ధి పనులు చేశానని, టెండర్ పిలిచినప్పుడు వ్యాట్, జీఎస్టీ లేదని చెప్పి తీరా బిల్లులు మంజూరు అయ్యాక జీఎస్టీ కట్టమని ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు.●పాలసముద్రం జడ్పీటీసీ అన్నలగన్ మాట్లాడుతూ బాలకృష్ణాపురం రోడ్డుపై 2018లో కంకరవేసి వదిలిపెట్టడంతో 5 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.● పెద్దతిప్పసముద్రం జడ్పీటీసీ శివన్న మాట్లాడుతూ కందుకూరులో తాగునీటి కోసం బోరు వేసి మోటర్ బిగించి విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు.●చౌడేపల్లె జడ్పీటీసీ దామోదరరాజు మాట్లాడు తూ వ్యవసాయ సర్వీసులకు డబ్బులు చెల్లించి రెండేళ్లుగా రైతులు ఎదురుచూస్తున్నారని,ఏఈని అడిగితే మెటీరియల్ లేదని సమాధానం చెబుతున్నారని వాపోయారు● పెనుమూరు జడ్పీటీసీ దొరస్వామి మాట్లాడుతూ కొటార్లపల్లె ఏపడబ్ల్యూ జగనన్న కాలనీలో 25మంది ఇళ్లు నిర్మించుకున్నా విద్యుత్ సర్వీసు ఇవ్వలేదని చెప్పగా సమస్యను పరిష్కరిస్తామని ఎస్ఈ హామీ ఇచ్చారు.●ఏర్పేడు జడ్పీటీసీ తిరుమలయ్య మాట్లాడుతూ మరమ్మతుకు గురైన ట్రాన్స్‌ఫార్మర్ల కోసం కార్యాలయాల చుట్టూ రైతులు కాళ్లరిగేలా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విద్యుత్ శాఖ ఎస్ఈ దృష్టికి తీసుకొచ్చారు.సమావేశానికి వైద్య శాఖ అధికారుల గైర్హాజరుపై సభ్యులతో పాటు జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా స్థాయి సమావేశానికి చిన్న స్థాయి అధికారులను పంపడం ఏంటని అసహనం వ్యక్తం చేశారు.జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డిప్యూటీ సీఈవో జుబేదా తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

తిరుచానూరు, మే 13(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి కుటుంబ సమేతంగా దర్శించు కున్నారు. ఆలయం వద్ద ఏఈవో దేవరాజులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకున్న వీరు.. అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. అమ్మవారి శేషవస్త్రంతో వేదపండితులు సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు పాల్గొన్నారు.



గంజాయి ముఠా అరెస్టు

- రెండు కిలోల గంజాయి స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), మే 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గంజాయి విక్రయిస్తున్న నలుగురిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి దాదాపు రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అలిపిరి సీఐ రాంకిషోర్ కథనం మేరకు.. శ్రీకాళహస్తి దర్గామిట్టకు చెందిన షేక్ మహబూబ్‌బాషా, కేవీబీపురం మండలం రాగిగుంటకు చెందిన కంచి చైతన్య, తిరుపతి సత్యనారాయణపురానికి చెందిన ఆదెం వెంకటసాయిప్రతాప్‌రెడ్డి, తిరుపతి రూరల్ తిమ్మినాయుడుపాళెంకు చెందిన మంగళం జోసఫ్ కొంతకాలంగా తిరుపతి రైల్వేస్టేషన్, బస్టాండు, ఇతర రద్దీ ప్రాంతాలను అడ్డాగా చేసుకుని గంజాయి విక్రయించేవారు. వీరు శ్రీకాకుళం జిల్లాకు చెందిన కింగ్‌పిన్ నుంచి రైళ్ల ద్వారా గంజాయి తెప్పించి చిన్న, చిన్న పొట్లాలు కడతారు. ఒక్కో పొట్లాన్ని రూ.100 నుంచి రూ.200 వరకు విక్రయించేవారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్ఐలు నాగార్జునరెడ్డి, సిబ్బంది కలసి లీలామహల్- మంగళం రోడ్డులోని బొంతాలమ్మ ఆలయం వద్ద కాపుకాచి నిందితులను పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంగమ్మ స్ఫూర్తితో తిరుగుబాటు చేయాలి

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



తిరుపతి(ఆటోనగర్), మే 13 (ఆంధ్రజ్యోతి): ‘నాడు పాలెగాళ్లకు వ్యతిరేకంగా సాగిన పోరాటమే నేటి గంగ జాతర. గంగమ్మ పోరాట స్ఫూర్తితో ప్రజలు పాలకులపై తిరుగుబాటు చేయాలి’ అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మను మంగళవారం దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. ‘వేల మంది జాతరకు హాజరైన సమయంలో వివిధ వేషాల్లో ఉన్నవారు ఎన్ని బూతులు తిట్టినా ప్రజలు పట్టించుకోరు. అదే ఈ జాతర ప్రత్యేకత’ అని పేర్కొన్నారు. 40 ఏళ్ల క్రితం ఒక వ్యక్తి ఆడవేషం వేసుకుని తనను బండిపై ఎక్కించుకొని వెళ్లారంటూ నారాయణ గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కె.మోహన్ కుమార్ రాజు, ఎ.రామానాయుడు, పి.మురళి తదితరులు పాల్గొన్నారు.

అంతా.. ప్రశాంతంగా..!

- పోలీసుల చొరవ భేష్



వీఐపీ దారిలో భక్తులను నియంత్రిస్తున్న డీఎస్పీ భక్తవత్సలం

తిరుపతి(నేరవిభాగం), మే 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి గంగ జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రద్దీని నియంత్రించడంతో ఎక్కడా తొక్కిసలాటలు జరగలేదు. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి భక్తుల రద్దీ బాగా పెరిగింది. వేలాది మంది ఒక్కసారిగా రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసి పోయింది. వీఐపీ లైను వద్ద మాత్రం చాలా రద్దీ కనపడడంతో డీఎస్పీ భక్తవత్సలం దగ్గరుండి భక్తులను అనుమతించారు. ఒక దశలో భక్తుల రద్దీని నియంత్రించడం పోలీసుల చేయిదాటే పరిస్థితి రావడంతో వెంటనే రోప్ పార్టీని పిలిపించారు. రాత్రి 7 గంటల నుంచి 9.45 గంటల వరకు మహిళలు, యువకులు, వేషాలు ధరించి వస్తున్న భక్తులు ఎక్కువ సంఖ్యలో రావడంతో వారిని కంట్రోలు చేయడానికి ఇబ్బంది పడ్డారు. ఇక, అన్ని కోణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో ఎక్కడ ఎలాంటి పరిస్థితి ఎదురైనా కమాండ్ కంట్రోలు యూనిట్ ద్వారా పరిశీలించి చర్యలు చేపట్టారు. భారీ సంఖ్యలో పోలీసులు మోహరించడంతో దొంగలు, చైన్ స్నాచర్లకు కొంత భయం ఏర్పడింది. బిట్రగుంట గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకోవడంతో చైన్ స్నాచింగ్‌లు కొంత తగ్గుముఖం పట్టాయి. ఇక, జనంలో మిస్ అయిన వారికోసం బాధితులు పోలీసు కంట్రోలు రూముకు సమాచారం ఇస్తుండడంతో వెంటనే వారిని అప్పగించేలా చర్యలు చేపట్టారు. ఇలా రెండు రోజుల వ్యవధిలో దాదాపు 53 మందిని అప్పగించారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, మే 13(ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మహిళలకు బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. మూడు నెలల పాటు రోజుకు రెండు విడతలుగా 140మంది మహిళలకు టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు కుట్టుమిషన్లు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తమ్మిరెడ్డి తనూజా, ఎంపీడీవో కోటేశ్వరావు, సీఐ రమణ, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్లు పద్మ, సుమతి, నాయకులు దొంతు బాలకృష్ణ, పునుగోటి విశ్వనాథ నాయుడు, మురళి, జీకేపల్లి బాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంతానోత్పత్తి పెంపునకే జననియాత్ర



సంతాన సాఫల్యతపై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మునిగిరీష్

గూడూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): సంతానోత్పత్తి పెంపొందించేందుకు వయాసిస్ ఫెర్టిలిటీ జననియాత్ర చేపట్టి అవగాహన కల్పించడం అభినందనీయమని రోటరీక్లబ్ మాజీ డిస్ట్రిక్ గవర్నర్ మునిగిరీష్ అన్నారు. మంగళవారం వయాసిస్ ఫెర్టిలిటీ జననియాత్ర బస్సు స్థానిక ఏఏఆర్ ప్రభుత్వ స్టేడియానికి చేరుకోవడంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి అవగాహన కల్పించారు. పిల్లలు లేని తల్లిదండ్రులకు వైద్యపరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పల్లవి మాట్లాడుతూ మదర్స్ డే సందర్భంగా తమ సంస్థ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో జనని యాత్రను చేపట్టి సంతానోత్పత్తిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సరైన వయస్సులో వివాహం చేసుకోకపోవడం, ఉద్యోగ రీత్యా ఆలస్యంగా పిల్లలను కనడమే సంతానోత్పత్తి తగ్గడానికి ప్రధాన కారణమన్నారు. కార్యక్రమంలో రాజేష్, శశిధర్, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ శివశంకర్

డక్కిలి, మే 13(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని ఎస్‌ఐ శివశంకర్ సూచించారు. మంగళవారం డక్కిలి మండలం కుథలవారిపల్లి వద్ద జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగే నష్టాలను వివరించారు. ఇకపై హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే జరిమానా విధించడమే కాకుండా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే పరిమితికి మించి జనాన్ని తరలిస్తున్న ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నిబంధనలు పాటించకపోతే ఆటోలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

శాస్త్రోక్తంగా సుదర్శన హోమం



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

తడ, మే 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేనాడులో దీవిలో వెలసిన శృంగీశ్వర శ్రీరంగపెరుమాళ్ ఆలయంలో జరుగుతున్న మహాలక్షార్చనలో భాగంగా మంగళవారం స్వామి వారికి పూలంగి సేవ నిర్వహించారు. పలు రకాల పుష్పాలతో స్వామివారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ ఎదుట హోమగుండం ఏర్పాటు చేసి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ సుదర్శన హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అశోక్ మొదలి, భాస్కర్ మొదలి, నందగోపాల్, దండపాణి, మణి, కృపాకర్ ఉభయకర్తలుగా వ్యవహరించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం

పెళ్లకూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్వాయిపాడు గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు మంగళవారం నిర్వహించారు. స్వామివారి విగ్రహానికి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గంగాబత్తిన రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఇలకూరుపాడులో రీసర్వే



రీ సర్వేకు సంబంధించి భూముల వివరాలను పరిశీలిస్తున్న తహసీల్దారు జయజయరావు, సర్వేయర్లు

కోట, మే 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిద్దవరం పంచాయతీ ఇలకూరుపాడులో మంగళవారం భూముల రీ సర్వే జరిగింది. పంచాయతీ పరిధిలోని భూములను రెండు సర్వే బృందాలు సర్వే చేస్తున్నాయి. తహసీల్దార్ జయజయరావు, మండల సర్వేయర్ గోపిరెడ్డి సర్వే బృందాలు, రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

అన్నదానం

గూడూరు అర్బన్, మే 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ చేశారు. గుమ్మడి సుధాకర్‌రావు, ప్రమీలమ్మ, శశిధర్, పూజిత ఉభయదాతలుగా వ్యవహరించారు.

రెండు బైక్‌ల ఢీ: ఇద్దరికి గాయాలు

వెంకటగిరి టౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వల్లివేడు క్రాస్‌రోడ్డు వద్ద రెండు మోటారు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరి గాయాలయ్యాయి. రాపూరు మండలం చెల్లటూరు గ్రామానికి చెందిన శ్రీరామదాసు సూర్యనారాయణ, లక్ష్మి తిరుపతి నుంచి స్వగ్రామానికి తిరిగి వెళుతుండగా వెనుక నుంచి మరో బైక్ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీరామదాసు సూర్యనారాయణ, లక్ష్మి దంపతులు గాయపడ్డారు. వీరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఐఎస్‌ఐ రమణయ్య తెలిపారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

చిట్టమూరు, మే 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గున్నాగుంట మలుపు వద్ద మంగళవారం తెల్లవారుజామున ఓ కారు కాలువలోకి దూసుకెళ్లింది. మల్లాం నుంచి నాయుడుపేటకు వెళ్తున్న కారు డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో కాలువలోకి దూసుకెళ్లిందని, ఈ ఘటనలో ఇద్దరు గాయపడినట్లు తెలిసింది. దీనిపై పోలీసులకు సమాచారం అందలేదని ఎస్‌ఐ చిన్న బలరామయ్య చెప్పారు.

నేడు చిట్టమూరు మండల సమావేశం

చిట్టమూరు, మే 13(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన బుధవారం జరుగుతుందని ఎంపీడీవో మన్‌హర్ గౌడ్ తెలిపారు. స్త్రీ సంక్షేమ భవనంలో ఉదయం 10 గంటలకు జరిగే సమావేశంలో మండలంలో తాగునీటి సమస్యపై చర్చించడం జరుగుతుందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీవో చెప్పారు.





వైఎస్‌ఆర్ పార్కులో శిథిలావస్థలో ఉన్న క్రీడా పరికరాలు - దుస్థితిలో అన్నంగి బాబురావు పార్కు

పట్టణవాసులకు ఆహ్లాదం కరువు

రూపుకోల్పోయి, దుస్థితికి చేరిన పార్కులు

గూడూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణవాసులకు ఆహ్లాదాన్ని అందించాల్సిన పార్కులు రూపుకోల్పోయాయి. వసతుల లేమితో పాటు పిచ్చి మొక్కలు పెరిగిపోయి, కొన్నింటికి ప్రహరీలు కూలిపోయి, మరికొన్నింటిలో ఎప్పుడో ఏర్పాటు చేసిన ఆట వస్తువులు శిథిలావస్థకు చేరుకుని నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. పచ్చని చెట్లు, చల్లని గాలులతో ఆహ్లాదాన్ని, మనస్సుకు ప్రశాంతను పంచాల్సిన పార్కులు నేడు దీనస్థితిలో ఉన్నాయి. పట్టణ ప్రజలు సేదతీరేందుకు మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో గతంలో పలుచోట్ల పార్కులను ఏర్పాటు చేశారు. చిన్నారులు ఆడుకునేందుకు, వృద్ధులు సేద తీరేందుకు, ప్రజలు ఆహ్లాదంగా గడిపేందుకు వీలుగా పార్కులను ఏర్పాటు చేశారు. పట్టణంలో ఐసీఎస్ రోడ్డులో వైఎస్‌ఆర్ పార్కు, రైతుబజారు సమీపంలో సీవీసీ పార్కు, అరుంధతీయపాళెం సమీపంలో పీఎస్‌ఆర్ పార్కు, వరదానగర్‌లో ఎన్టీఆర్ పార్కు, నెహ్రూనగర్‌లో సర్వేపల్లి రామారావు పార్కు, మాళవ్యానగర్‌లో అన్నంగి బాబురావు పార్కు, జానకీరామ్‌పేటలో రామ్‌నగర్ పార్కులను మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఇందులో సర్వేపల్లి రామారావు పార్కులో చిన్నారులు ఆడుకునేందుకు దాతలు క్రీడా వస్తువులను ఏర్పాటు చేయడంతో ఆడుకునేందుకు వీలుగా ఉంది. సీవీసీ పార్కులో నీడనిచ్చే చెట్లు ఉండడంతో ఎక్కువ మంది ప్రజలు సేద తీరుతుంటారు. మిగిలిన పార్కులు దుస్థితికి చేరుకున్నాయి. కొన్ని పార్కులు పిచ్చిమొక్కలతో నిండిపోయి నిరుపయోగంగా ఉంటే, మరికొన్ని ప్రహరీ కూలిపోయి దుస్థితిలో ఉన్నాయి. వేసవిలో సెలవులు కావడంతో చిన్నారులు ఆడుకోవడానికి తగిన స్థలం లేదని, పార్కుల్లో వసతులు లేకపోవడంతో స్థానిక ఏఏరెడ్డి ప్రభుత్వ స్టేడియానికి పిల్లలను తీసుకెళ్లాల్సి వస్తోందని పట్టణవాసులు అంటున్నారు. దుస్థితిలో ఉన్న పార్కులను అభివృద్ధి పరచడంతో పాటు చిన్నారులు ఆడుకునేందుకు క్రీడా పరికరాలు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అదేవిధంగా పట్టణంలో విశాల ప్రదేశంలో పెద్ద పార్కును ఏర్పాటు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.





పొగగొట్టం కాలనీవాసులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా - ఒంటిపై పెట్రోల్ పోసుకున్న వెన్నెలను అడ్డుకుంటున్న సీఐ బాబీ, ఎస్‌ఐ ఆదిలక్ష్మి, పోలీస్ సిబ్బంది

అక్రమ కట్టడం కూల్చివేత

పెట్రోల్ పోసుకుని మహిళ ఆత్మహత్యాయత్నం

అడ్డుకున్న పోలీసులు

నాయుడుపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పొగగొట్టం కాలనీలో అక్రమంగా నిర్మిస్తున్న భవనాన్ని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ అధికారులు మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేశారు. పొగగొట్టంకాలనీ ప్రాంతంలోని దాదాపు 18.57 ఎకరాలను 11 మంది రైతులు కొన్నేళ్లుగా సాగుచేసుకుంటున్నారు. ఈ క్రమంలో అక్కడ శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. సదరు భూములు తమకు చెందినవంటూ వెంకటగిరి రాజా వీఎస్‌జీ యాచేంద్ర హైకోర్టును ఆశ్రయించారు. రైతులు కూడా కౌంటర్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో పొగగొట్టంకాలనీ ప్రాంతంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని హైకోర్టు స్టే మంజూరు చేసింది. ఇటీవల కావేరిపాకం లోకేష్ భవన నిర్మాణం చేపట్టడంతో మున్సిపల్ అధికారులు అడ్డుకున్నారు. మళ్లీ నిర్మాణం కొనసాగిస్తుండడంతో మంగళవారం కమిషనర్, పోలీసు, రెవెన్యూ అధికారులు పొగగొట్టంకాలనీకి చేరుకుని భవనాన్ని కూల్చివేశారు. ఈ క్రమంలో లోకేష్ బంధువు కావేరిపాకం వెన్నెల అనే మహిళ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యా యత్నం చేయడంతో సీఐ బాబీ, ఎస్‌ఐ ఆదిలక్ష్మి, పోలీస్ సిబ్బంది అడ్డుకున్నారు.





లక్ష్మీనరసింహస్వామి వసంతోత్సవం - చక్రస్నానం చేయిస్తున్న వేదపండితులు

ముగిసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

చిల్లకూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కలవకొండ లో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. మంగళవారం స్వామివారికి వసంతోత్సవం, చక్రస్నానం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి స్వామి అమ్మవార్లకు పుష్పయాగం, ఏకాంతసేవ నిర్వహించారు. ఊసారెడ్డి రాధాక్రిష్ణారెడ్డి, సులోచనమ్మ, చిట్టమూరు శ్రీనివాసులు రెడ్డి, ఉమామహేశ్వరి, కొండా రామచంద్రారెడ్డి, భవాని, సోమిశెట్టి రామసుబ్బయ్య, రాజ్యలక్ష్మి, మందపాక మురళీరెడ్డి, రాధ, జనార్దనరెడ్డి, అనూష ఉభయ దాతలుగా వ్యవహరించారు. ఈవో రవికృష్ణ, ఉత్సవ కమిటీ చైర్మన్ నెల్లటూరు చిరంజీవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యుత్ కార్యాలయ ఉద్యోగి ఆత్మహత్య

గూడూరు అర్బన్, మే 13(ఆంధ్రజ్యోతి): స్థానిక టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు... స్థానిక గాంధీనగర్ సమీపంలోని టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న సుబ్బారావు(43) నెల్లూరులోని విద్యుత్ కార్యాలయంలో సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. కుటుంబకలహాల నేపథ్యంలో మనస్థాపానికి గురైన సుబ్బారావు మంగళవారం ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసు కున్నాడు. గమనించిన కుటుంసభ్యులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానాకి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉపాధి పనులు చేస్తూ కూలీ మృతి

వాకాడు, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావిగుంటపాళెం గ్రామానికి చెందిన పావలశెట్టి కలివేలమ్మ(56) మంగళవారం ఉపాధి పనులకు వెళ్లింది. ఎండ తీవ్రతకు తట్టుకోలేక అస్వస్థతకు గురవడంతో వెంటనే నిడిగుర్తి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో శ్రీనివాసులు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. ఏపీవో విజయమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, మల్లికార్జున ఉన్నారు.

రైలునుంచి జారిపడి ప్రయాణికుడి మృతి

తడ, మే 13 (ఆంధ్రజ్యోతి): రైల్లో నుంచి జారిపడి ప్రయాణికుడి మృతి చెందిన ఘటన తడ - అక్కంపేట మధ్య మంగళవారం జరిగింది. మృతుడు తెలుపు, నీలిరంగు గళ్ల చొక్కా, నలుపురంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, అంతకుమించి ఎటువంటి ఆధారాలు లభించలేదని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని సూళ్లూరు పేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

ముక్కంటి ఆలయ సెక్యూరిటీ గార్డు దౌర్జన్యం

● కమీషన్ కోసం లాడ్జి మేనేజరుతో వాగ్వాదం

శ్రీకాళహస్తి, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు లాడ్జీలో భక్తులు అద్దె గదులు పొందడంపై కమీషన్ ఇవ్వాలంటూ ఓ ముక్కంటి ఆలయ సెక్యూరిటీ గార్డు దౌర్జన్యానికి పాల్పడ్డాడు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో పనిచేసే కొందరు సెక్యూరిటీ గార్డులు భక్తులను అద్దె గదుల కోసం ప్రైవేటు లాడ్జీలకు పంపుతుంటారు. భక్తుల నుంచి అధిక ధరలు వసూలు చేసి నిర్వాహకులు దళారీలుగా వ్యవహరించే సెక్యూరిటీలకు కమీషన్లు చెల్లిస్తుంటారు. అలా ఓ సెక్యూరిటీ గార్డు 2వ గేటు సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు లాడ్జి మేనేజరుతో మంగళవారం వాగ్వాదానికి దిగాడు. తానుపంపించిన భక్తులు తీసుకున్న అద్దె గది నుంచి కమీషన్ ఇవ్వాలంటూ బూతుల దండకం అందుకున్నాడు. తాము ఎలాంటి కమీషన్లు ఇవ్వమని మేనేజరు ఎదురుదాడి దిగుతూ ఈ సంభాషణను వీడియో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడు. ముక్కంటి ఆలయ సెక్యూరిటీ గార్డు యూనిఫాంలో కమీషన్ కోసం బూతు పదజాలంతో మాట్లాడిన తీరుపై పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి.

ఆ అధికారి తీరు వల్లే...

ముక్కంటి ఆలయంలో కీలక స్థానంలో ఉన్న ఓ అధికారి తీరువల్ల గత ఆరేళ్ల నుంచి సెక్యూరిటీ వ్యవస్థ దళారీకి మారుపేరుగా మారిపోయింది. సంపాదనే ధ్యేయంగా ముక్కంటి ఆలయంలో ఓ అధికారి 2019 వైసీపీ పాలన నుంచి బరితెగించాడన్న అపవాదును మూటగట్టుకున్నాడు. వైసీపీ నేతల నుంచి ఆయనకు పూర్తిమద్దతు ఉండటంతో నాలుగున్నర సంవత్సరాల పాటు ఆయన సెక్యూరిటీ వ్యవస్థను అవినీతి మయంగా మార్చేశారన్న విమర్శలు వెల్లువెత్తాయి. పలు నేరాల్లో భాగస్వాములు అయినవారిని, సెక్యూరిటీకి ఎలాంటి అర్హత లేనివారిని సైతం ఆయన యథేచ్ఛగా నియమించుకున్నాడు. ముక్కంటి ఆలయంలో హుండీ లెక్కింపులో భారీగా చోరీకి పాల్పడి పట్టుబడిన సెక్యూరిటీ గార్డును పదేళ్ల క్రితం అప్పటి అధికారులు తొలగించారు. వైసీపీ పాలనలో అవినీతి అధికారిగా పేరు మోసిన వ్యక్తి హుండీ దొంగను తన అనధికారిక పీఏగా నియమించుకున్నారు. సెక్యూరిటీ వ్యవస్థలో తిరిగి హుండీ చోరీ కేసులో నిందితుడైన వ్యక్తిగా దర్జాగా నియమించుకున్నారు. ఒకరోజు కూడా ఆ సెక్యూరిటీ గార్డు యూనిఫాం ధరించకపోగా వైట్ అండ్ వైట్‌లో వైర్‌లెస్ సెట్‌ను చేతబట్టి కీలక అధికారిగా ఆలయంలో చెలరేగిపోయేవాడు. దీనిపై పెద్దఎత్తున ఫిర్యాదులు వచ్చాయి. దాంతో అధికారి తన అనధికారిక సెక్యూరిటీ గార్డును తాత్కాలికంగా తొలగించారు. ఆయనకు ఉన్న అధికారిక పలుకుబడితో హుండీ చోరీకి పాల్పడిన యువకుడిని సరిగ్గా గత ఏడాది ఎన్నికలకు ముందు ఒప్పంద ఉద్యోగిగా కమిషన్ ఆర్డర్స్‌తో తిరిగి అధికారికంగా నియమించుకున్నారు. ఈ సమయంలో నాలుగున్నరేళ్ల పాటు వైసీపీ పాలనలో భారీగా అవినీతి అక్రమాలకు పాల్పడ్డ ఆ అధికారికి చివరి ఆరు నెలల కాలంలో పంపకాల విషయంలో వైసీపీ నేతలతో విబేధాలు తలెత్తాయి. దాంతో ఆయన్ను గోశాలకు బదిలీ చేశారు. తాను వైసీపీకి వ్యతిరేకినంటూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆ అధికారి మళ్లీ టీడీపీ నేతల పంచన చేరాడు. ఆలయంలోకి పది నెలల క్రితం తిరిగి మళ్లీ తిష్టవేశాడు. అప్పటి నుంచి రెట్టించి అక్రమాలకు పాల్పడుతున్నట్లు తరచూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా ఆయన పరిధిలోని విభాగాల్లో ఉన్న సెక్యూరిటీ వ్యవస్థపై మళ్లీ ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ అధికారి పర్యవేక్షణలో సుమారు తొమ్మిదిసార్లు పలువురు సెక్యూరిటీ గార్డులు భక్తుల నుంచి డబ్బులు వసూలు చేసి దర్జాగా అడ్డదారి దర్శనాలకు వెళుతూ పట్టుబడ్డారు. ఈ అధికారి అక్రమ వసూళ్ల సెక్యూరిటీ గార్డులకు అండగా నిలబడటంతో ఏ ఒక్కరిపై అప్పట్లో చర్యలు తీసుకోలేదు. ఒక సెక్యూరిటీ గార్డు ప్రైవేటు అద్దె గదెను ప్రోత్సహించడమే కాకుండా కమీషన్ కోసం గొడవకు దిగడం పెద్దఎత్తున చర్చనీయాంశంగా మారింది. ఆరేళ్ల నుంచి అక్రమాలకు అండగాద నిలుస్తున్న అధికారిపై దేవదాయశాఖ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు 48మంది ఎంపిక



రెజ్లింగ్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

నాయుడుపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి రెజ్లింగ్ అండర్-17 మెన్ అండ్ ఉమెన్ పోటీలు జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రోసనూరులో నిర్వహించారు. ఇందులో 48క్రీడాకారులు రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈనెల 16, 17, 18 తేదీల్లో చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను నాయుడుపేట ట్రినేటి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి చైర్మన్ ఆదవరపు నాగూరయ్య, రెజ్లింగ్ అసోసియేషన్ కోశాధికారి ఎ.అభిలాష్, కోచ్‌లు ఇందుజా, లోకేష్, ప్రసాద్ తదితరులు అభినందించారు.

ఇళ్ల సమీపంలో ఖననం చెయ్యొద్దు

అంత్యక్రియలను అడ్డుకున్న ఎస్సీ కాలనీవాసులు



మృతురాలి బంధువులతో మాట్లాడుతున్న తహసీల్దారు విజయలక్ష్మి

బాలాయపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిండలి గ్రామానికి చెందిన వల్లెపు కోటమ్మ(110) మృతి చెందింది. మంగళవారం ఆమె మృతదేహాన్ని సమీపంలోని చెరువులో ఖననం చేసేందుకు కుటుంబ సభ్యులు సిద్ధమయ్యారు. దీంతో సమీపంలోని ఎస్సీ కాలనీవాసులు అభ్యంతరం చెప్పారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న తహసీల్దారు విజయలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది, పోలీసులను ఘటనాస్థలానికి పంపి మృతదేహాన్ని ఇళ్ల సమీపంలో పూడ్చనీయవద్దని చెప్పారు. మృతురాలి కుటుంబసభ్యులు అంగీకరించపోవడంతో తహసీల్దారు విజయలక్ష్మి వెళ్లి చెరువులో ఖననం చేయడం కుదరదని స్పష్టం చేశారు. దీంతో కోటమ్మ మృతదేహాన్ని శ్మశానంలో పూడ్చిపెట్టారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కోట, మే 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుచ్చలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు మంగళవారం బాల్యవివాహాల నిర్మూలన, చట్టాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ వర్కర్ అనిత, మహిళా పోలీస్ సునీల, మస్తానమ్మ, సచివాలయ సిబ్బంది పుచ్చలపల్లి పంచాయతీలోని చిన్నారుల తల్లులకు బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. అదేవిధంగా కార్మిక చట్టాలు, మహిళా హక్కుల గురించి అవగాహన కల్పించారు.

సూరిశెట్టిపాళెంలో కోటమ్మ ఉత్సవాలు

కోట, మే 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొక్కుపాడు పంచాయతీ సూరిశెట్టిపాళెంలో గ్రామదేవత కోటమ్మ ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే అమ్మవారి ఉత్సవాలకు గ్రామస్తులు అంకురార్పణ చేశారు. అమ్మవారి పుట్టినిల్లైన నెల్లూరుపల్లి కొత్తపాళెం నుంచి నగలు, అభరణాలను గంగపెట్టెలో ఉంచుకుని మేళతాళాలతో సూరిశెట్టిపాళెంలోని అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారి ముగ్గులు వేశారు. మొదటి రోజు జమిళ్లు కట్టి గ్రామంలోకి దుష్టశక్తులు, అంటురోగాలు ప్రబలకుండా ప్రత్యేక పూజలు చేశారు.



కోటమ్మ అభరణాలు తీసుకువెళుతున్న గ్రామస్తులు

శ్రీకాళహస్తి
సత్యవేడు

సీబీఎస్ఈ ఫలితాల్లో శ్రీసిటీ విద్యాసంస్థల హవా

సత్యవేడు, మే 13: మంగళవారం వెలువడిన సీబీఎస్ఈ పరీక్షా ఫలితాల్లో శ్రీసిటీలోని చిన్మయా విద్యాలయ, అకార్డ్ విద్యాసంస్థలు వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు సంబంధిత పాఠశాలల యాజమాన్యం పేర్కొన్నాయి. చిన్మయా విద్యాసంస్థల నుంచి 57 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 16 మంది డిస్టింక్షన్, 29 మంది ఫస్ట్‌క్లాస్, 12 మంది సెకండ్ క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారు. 12వ తరగతి పరీక్షలకు 18 మంది హాజరు కాగా ఆరుగురు డిస్టింక్షన్, మిగిలిన వారు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ కే.భువనేశ్వరి తెలిపారు. చిన్మయా విద్యాలయానికి సంబంధించి వరుసగా తొమ్మిదవ సారి టెన్త్ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. అకార్డ్ స్కూల్‌కు సంబంధించి వరుసగా రెండో ఏడాది టెన్త్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ బృంద తెలిపారు. 29 మంది పరీక్షలకు హాజరు కాగా 11 మంది డిస్టింక్షన్, తొమ్మిది మంది ఫస్ట్‌క్లాస్, ఆరుగురు సెకండ్ క్లాస్, ముగ్గురు థర్డ్ క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారని ఆమె తెలిపారు.

మూలన కూర్చోబెట్టినా బుద్ధి మారలేదు
వైసీపీపై మండిపడ్డ టీడీపీ బీసీ సంఘం నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రజలు వైసీపీని మూలన కూర్చోబెట్టినా బుద్ధి ంలేదని టీడీపీ బీసీ విభాగం నాయకులు ధ్వజమెత్తారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పేదరిక నిర్మూలన కోసం పీ4 పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. దీంతో వైసీపీ ఈ పథకంపై విషం చిమ్ముతోందని మండిపడ్డారు. ఇలాంటి వారిని సమాజానికి దూరంగా తరిమివేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తన అనుకూల మీడియాకు గత వైసీపీ పాలన ఐదేళ్లలో రూ.858కోట్లు దోచిపెట్టింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇక సాక్షి పత్రిక కొనుగోలు కోసం ఒక్కో వలంటీర్‌కు నెలకు రూ.200 చొప్పున చెల్లించిందన్నారు. దీంతో రూ.203కోట్లు దోచారన్నారు. ఇక ఐప్యాక్‌కు రామ్ ఇన్ఫో అనే సంస్థను నెలకొల్పి నిధులు మళ్లించిన నాటి జగన్ ప్రభుత్వ నిర్వాహకంపై ప్రభుత్వం విచారణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు మునిరాజాయాదవ్, కోట చంద్రశేఖర్, బి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు

శ్రీకాళహస్తి, మే 13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యవకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలంలోని ఊరందూరు సమీపంలో పంగూరు రహదారిపై మంగళవారం వేకువజామున జరిగింది. శ్రీకాళహస్తి మండలం తొండమనాడుకు చెందిన శివశంకర్(20), చంద్రగిరికి చెందిన మల్లికార్జున్(22) రేణిగుంట సమీపంలోని ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తుంటారు. వీరిద్దరు శ్రీకాళహస్తి మండలంలో ఓ మిత్రుని గ్రామంలో జరిగే అమ్మవారి ఉత్సవానికి సోమవారం రాత్రి హాజరయ్యారు. మంగళవారం వేకువజామున తిరిగి పరిశ్రమలో విధులకు వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మార్గమధ్యంలో ఊరందూరు వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను ఢీకొట్టింది. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని స్థానికులు శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. ఈ ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు కింద పడి వృద్ధుడి ఆత్మహత్య

శ్రీకాళహస్తి, మే 13(ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడు(60) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ నరసింహులు తెలిపిన వివరాలు... గుర్తు తెలియని వృద్ధుడు మంగళవారం శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం చివరి ప్రదేశంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి శరీరం గుర్తు పట్టలేని విధంగా ఛిద్రమైంది. మృతదేహంపై తెల్లని చొక్కా, తెల్లని పంచె, బ్లూ కలర్ డ్రాయర్, ఎరుపురంగు మొలతాడు ఉన్నట్లు తెలిపారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చూరీకి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


వేణు మృతదేహం

శ్రీకాళహస్తి, మే 13(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన తొట్టంబేడు మండలంలోని ఇలగనూరు సమీపంలోని తెలుగుగంగ కాలువలో మంగళవారం జరిగింది. దయనేడు గ్రామానికి చెందిన వేణు(20) ట్రాక్టర్ డ్రైవర్. కొంతకాలం క్రితం తండ్రి మరణించడంతో తల్లితో పాటు నాయుడుపేటకి కాపురం మార్చారు. వారం రోజుల క్రితం మళ్లీ స్వగ్రామానికి వచ్చారు. మరో ముగ్గురు యువకులతో కలిసి వేణు తెలుగుగంగ కాలువలో ఈత కోసం వెళ్లాడు. సాయంత్రం కాలువలో శవమై తేలడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వైభవంగా కరిమాణిక్యస్వామి గరుడసేవ



నాయుడుపేట టౌన్, మే 13 (ఆంధ్ర జ్యోతి): నాయుడుపేట - తుమ్మూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కరి మాణిక్యస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగు తున్నాయి. మంగళవారం ఉదయం పూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి గరుడ వాహనసేవ నిర్వహించారు.

పుత్తూరు వార్తలు

లబ్ధిదారుల వద్దకే వెళ్లి సీఏం సహాయ నిధి చెక్కుల అందజేత


కదిరిమంగళంలో చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

వడమాలపేట, మే 13(ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురై ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్న బాధితులకు అండగా తానున్నానంటూ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆపన్న హస్తం అందించారు. మండలంలో నలుగురికి వారి ఇళ్లకే వెళ్లి సీఏం సహాయ నిధి చెక్కులను అందజేశారు. మంగళవారం మండలంలోని కాయం దళిత వాడలో భాగ్యలక్ష్మికి రూ.1,32,941, కాయం గ్రామంలో నారాయణరెడ్డికి రూ.74,670, పూడిలో జానకిరామయ్యకు రూ.36,608, కదిరిమంగళంలో దామోదరానికి రూ.1,00,322 చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులునాయుడు, నాయకులు ఉమాపతిరావు, వెంకటేష్ యాదవ్, వెంకట్రామనాయుడు, దొరస్వామి, బత్తినాయుడు, పూర్ణచంద్ర నాయుడు, కుమార్, శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

16న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

పుత్తూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 16వ తేదీ శుక్రవారం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. బహుళ జాతి సంస్థలు పాల్గొనే ఈ మేళాను రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్, డీఆర్‌డీఏలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని చెప్పారు. టెన్త్ ఉత్తీర్ణులనుంచి ఇంజనీరింగ్ కోర్సులు వరకు చదివిన ఔత్సాహిక అభ్యర్థులు మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు నెం.6300954441, 6304330520లలో సంప్రదించాలని తెలిపారు.

రుద్రమోహన్‌కు సాహితీ పురస్కారం


పురస్కారం అందుకుంటున్న రుద్రమోహన్

పుత్తూరు అర్బన్, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల్లో పుత్తూరుకు చెందిన కవి, రచయిత రుద్రమోహన్‌కు అవార్డు అందుకున్నారు. ఆయనకు తెలుగు భాషా సేవా సాహితీ పురస్కారాన్ని శ్రీశ్రీ కళావేదిక అందించింది. ఏలూరు వేదికగా ఈనెల 10, 11వ తేదీలలో శ్రీశ్రీ కళావేదిక సంస్థ 48 గంటల పాటు నిర్విరామంగా ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతిభా పురస్కారాలను అందజేశారు. మూడు దశాబ్దాలుగా సామాజిక సమైక్యతపై అనేక కథలు, కవితలు రాస్తున్న అత్తూరు రుద్రమోహన్‌ను తెలుగు భాషా సేవా సాహితీ పురస్కారంతో సత్కరించారు.

రేపు దక్షిణామూర్తికి అష్టోత్తర శత శంఖాభిషేకం

శ్రీకాళహస్తి, మే 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న గురు దక్షిణామూర్తికి ఈనెల15న గురువారం అష్టోత్తర శత శంఖాభిషేకం నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. గురుదక్షిణామూర్తి వృషభరాశి నుంచి మిథునరాశిలోకి ప్రవేశించే సందర్భంగా ఉదయం 9గంటలకు పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సింహ, ముత్యపు పందిరి వాహనాలపై కల్యాణ వెంకన్న విహారం


సింహ, ముత్యపుపందిరి వాహనాలపై పురవిహారం చేస్తున్న కల్యాణ వెంకన్న

నారాయణవనం, మే 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మావతి దేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం స్వామివారు సింహవాహనంపై, రాత్రి ముత్యపు పందిరి వాహనంపై విహరిస్తూ భక్తులపై వరాలజల్లు కురిపించారు. వేకువ జామున 5 గంటల నుంచి సుప్రభాతసేవ సహా నిత్య పూజా కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పుష్పాలు, సర్వాభరణాలతో అలంకరించి సింహ వాహనంపై అధిష్ఠింపజేశారు. మేళతాళాలు, వేదమంత్రాలు, గోవింద నామ స్మరణల నడుమ స్వామివారిని గ్రామంలో ఊరేగించారు. ఆలయానికి చేరుకున్న స్వామి వారికి ఉభయనాంచారులతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం నిత్య పూజల అనంతరం స్వామివారికి ఊంజలసేవ నిర్వహించారు. రాత్రి 7.30 గంటలకు ముత్యపు పందిరి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఊరేగింపులో స్వామి వారికి, భక్తులు మంగళ హారతులు, కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఉత్సవాల ఏర్పాట్లను డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీధర భట్టాచార్య, ఆలయ సిబ్బంది తదితరులు పర్యవేక్షించారు.

కమనీయం చెన్నకేశవుడి కల్యాణం


సారె మోసుకొస్తున్న ఈవో బాపిరెడ్డి తదితరులు - వేద పండితులకు సారె అందజేత - ప్రత్యేక అలంకారంలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి

శ్రీకాళహస్తి, మే 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణం మంగళవారం కనులపండువగా సాగింది. చెన్నకేశవ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయం ప్రాంగణంలో ఈ వేడుక జరిగింది. అంతకు ముందు శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి ఈవో బాపిరెడ్డి ఆధ్వర్యంలో సారె సమర్పించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకాలు నిర్వహించి సుందరంగా తీర్చిదిద్దారు. స్వామిఅమ్మవార్ల కల్యాణ మహోత్సవం వేదమంత్రోచ్ఛరణల మధ్య అంత్యంత రమణీయంగా సాగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం స్వామి అమ్మవార్లు గజవాహనంపై గ్రామంలో ఊరేగారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన చంద్రశేఖర్ నాయుడు



సత్యవేడు, మే 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి లోకేశ్‌ను సత్యవేడు నియోజకవర్గ టీడీపీ అబ్జర్వర్ చంద్రశేఖర్ నాయుడు మంగళవారం అమరావతిలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధి, త్వరలో నియమించనున్న పార్టీ కమిటీల ఏర్పాటు తదితర అంశాలపై మంత్రితో చర్చించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని, అందుకు సహకరిస్తామని మంత్రి భరోసా ఇచ్చినట్లు తెలిపారు. తరచూ పార్టీ తరఫున గ్రీవెన్స్‌సెల్ నిర్వహించి కార్యకర్తల కష్టాలతో పాటు, ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి సూచించినట్లు తెలిపారు. కమిటీలను ఎలాంటి వివాదాలు లేకుండా పారదర్శకంగా ఏర్పాటు చేసుకోవాలని, అందరినీ కలుపుకుని పోవాలని మంత్రి లోకేశ్ ఆదేశించినట్లు చంద్రశేఖర్‌నాయుడు వివరించారు.

స్టార్టర్లు, కేబుళ్ల చోరీ



ఏర్పేడు, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సరస్వతికండ్రిగలో సోమవారం రాత్రి 30మంది రైతులకు సంబంధించి 50 స్టార్టర్లు, కేబుల్ వైర్లు చోరీ అయ్యాయి. వేసవి కావడంతో పంటలకు నీరు పట్టడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. దీనిపై ఏర్పేడు పోలీసులకు రైతులు మంగళవారం ఫిర్యాదు చేశారు. విచారించి తగు న్యాయం చేస్తామని పోలీసులు తెలిపారు.

బోర్లకు మరమ్మతులు



శ్రీకాళహస్తి, మే 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 32వార్డు దర్గామిట్టలో చేతిబోర్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో ప్రజలు తాగునీటి కోసం ఇక్కట్లు పడ్డారు. స్థానిక నాయకులు ఎమ్మెల్యే సుధీర్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన సంబంధిత అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. దీంతో మంగళవారం దర్గామిట్ట, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా, బాలాజీ లైన్ తదితర ప్రాంతాల్లో బోర్లకు మరమ్మతులు చేపట్టారు. టీడీపీ నాయకులు పి.శ్రీనివాసులురెడ్డి, పి.యశ్వంత్‌రెడ్డి, మునిరాజా యాదవ్, షాబుద్దీన్, లోకేష్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

నేడు బీపీఅగ్రహారం జాతర


బీపీ అగ్రహారంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ

శ్రీకాళహస్తి, మే 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీపీ అగ్రహారంలో బుధవారం గంగమ్మ జాతర జరగనుంది. పట్టణంలో రెండు రోజుల నుంచి జాతర సందడి నెలకొంది. మంగళవారం అర్ధరాత్రి తరువాత బీపీ అగ్రహారంలో కొలువై ఉన్న ఆలయం నుంచి అమ్మవారి ఉత్సవమూర్తి ఊరేగింపు జరగనుంది. బుధవారం ఉదయం ఆలయం వద్ద ఉత్సవమూర్తి కొలువుదీరి రాత్రి వరకు భక్తులకు దర్శనమిస్తారు. చివరిగా నిమజ్జనంతో జాతరకు ముగింపు పలకనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం బీపీ అగ్రహారం విద్యుత్ అలంకరణలతో జాతర సందడి నెలకొంది.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


శ్రీకాళహస్తిలో వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి, మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లు, కార్లు, ద్విచక్ర వాహన దారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనం కలిగిన ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, అదే విధంగా కార్లు నడిపేవారు సీటుబెల్టు ధరించాలని తెలిపారు. ఇక వాహనదారులు తమ వాహనాలకు సంబంధించి పత్రాలను ఉంచుకోవాలన్నారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన కొత్త మోటర్ వాహన చట్టాలపై ప్రజలు వాహన చోదకులు అవగాహన కలిగి ఉండాలని సీఐ జయచంద్ర తెలిపారు. మంగళవారం సాయంత్రం పాత చెక్ పోస్ట్ కూడలి వాహన తనిఖీలు చేపట్టారు. ఇటీవల రోడ్డు ప్రమా దాల్లో ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతు న్నారని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై ఈ-చలానా విధిస్తామని తెలిపారు. ఎస్ఐ అరుణ్ కుమార్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

జాతరలో పాల్గొన్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, మే 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీపీఅగ్రహారంలో జరిగే జాతరకు టీడీపీ నాయకులు బొజ్జల సురేష్‌రెడ్డి హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి ప్రజలు ఎల్లవేళలా అష్ట ఐశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, నాయకులు చెంచయ్యనాయుడు, కంఠా రమేష్, పోలూరు శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొనానరు.

కాస్త నీడ ఏర్పాటు చేయండి


ఎండలోనే బిల్లులు కడుతున్న విద్యుత్ వినియోగదారులు

శ్రీకాళహస్తి, మే 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధర్మరాజుల ఆలయ సమీపంలో విద్యుత్‌శాఖ కార్యాలయం ఉంది. ఇక్కడ ప్రజలు బిల్లులు కట్టడానికి ఎండలోనే క్యూలో వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంటోంది. కనీసం రేకుల షెడ్ కానీ, కూర్చోవడానికి కుర్చీలు కాని లేవు. దీంతో మండుటెండలోనే ప్రజలు క్యూలో నిలబడి తమ గృహ విద్యుత్ వినియోగ బిల్లులను చెల్లిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కౌంటర్ వద్ద కనీస ఏర్పాట్లు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

పీహెచ్‌సీలో ప్రసవాలను పెంచండి
వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ

తిరుపతి(కలెక్టరేట్), మే 13(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీలో ప్రసవాలను పెంచాలని వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు అన్నారు. విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో మంగళవారం జిల్లా అధికారులతో సమీక్షించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండ్యన్ ఈ సమీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీడీ సర్వే వేగవంతం చేయాలని ఆదేశించారు. మాతాశిశు మరణాలను నివారించేందుకు కృషి చేయాలన్నారు.

వైద్యాధికారిగా మురళీధర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

బుచ్చినాయుడుకండ్రిగ, మే 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిగా మురళీధర్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న డాక్టర్ దివాకర్ పీజీ సీటు రావడంతో వెళ్లిపోయారు. ఈయన స్థానంలో మురళీధర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. రోగులకు మెరుగైన సేవలందిస్తామని ఈ సందర్భంగా డాక్టర్ తెలిపారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



రేణిగుంట, మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గంగమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరను పురస్కరించుకుని యేటా పట్టణంలోని గంగమ్మకు పొంగళ్లు పెట్టడం ఆనవాయితీ. ఈక్రమంలో మహిళలు పొంగళ్లు వండి అమ్మవారికి సమర్పించారు. తిరుపతి గంగ జాతర ముగిసిన మొదటి మంగళవారం నుంచి ఐదువారాల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయి.

జాతర సందడి


పొంగళ్లు వండుతున్న మహిళలు

కేవీబీపురం, మే 13(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో కొలువై ఉన్న శీతాలాంబ, సత్తెమ్మ ఆలయాల్లో గంగజాతర సందర్భంగా మహిళలు బుధవారం పెద్దఎత్తున పొంగళ్లు పెట్టారు. కోరిన కోర్కెలు తీర్చాలని, మండలం సుభిక్షంగా ఉండాలని, వర్షాలు బాగా పడి పంటలు పండాలని అమ్మవారికి మొక్కుకున్నారు.

గంగమ్మకు పొంగళ్లు



శ్రీకాళహస్తి, మే 13 (ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం పెద్దకన్నలి గ్రామంలో వెలసిన గంగమ్మ అమ్మవారికి మంగళవారం అత్యంత వైభవంగా భక్తులు పొంగళ్లు పెట్టారు. ఉదయాన్నే మహిళా భక్తులు అంబళ్లు సమర్పించుకున్నారు. గ్రామస్తులు, భక్తులు పెద్దసంఖ్యలో గంగమ్మ తల్లి పొంగళ్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారికి చీరలు కట్టి పుష్పాలతో అలంకరించారు. మహిళా భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారికి సారె సమర్పించారు.

ముక్కంటి సేవలో హైకోర్టు న్యాయమూర్తి


ఆలయ ధ్వజ స్తంభం వద్ద జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప్

శ్రీకాళహస్తి, మే 13(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని మంగళవారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.